ఆకాశదేవర



# నగ్నముని

విలోమ కథ

# ఆకాశదేవర

విలోమ కథ

---

## నగ్నముని

✿

ప్రజాస్వామ్య ప్రచురణ
'రవి ఎపార్ట్‌మెంట్స్' 10-11-1/2 - ఫ్లాట్ నెం. 101
సలీం నగర్, మలక్‌పేట
హైదరాబాద్-36

✿

నగ్నముని విలోమ కథ

# ఆకాశదేవర

రచనా కాలం: మార్చి - ఏప్రిల్, 2011

మొదట అచ్చయింది :

వార్త దినపత్రిక - సెప్టెంబర్ 8, 25 ఆదివారం అనుబంధ సంచికల్లో

పుస్తక రూపంలో మొదటి ముద్రణ - జనవరి, 2012

రెండవ ముద్రణ - ఏప్రిల్, 2012

రెండుసార్లూ ప్రచురించిన వారు:

శ్రీ దేవినేని మధుసూదన రావు

దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్,

తెన్నేరు, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా

ఇది మూడవ ముద్రణ : జనవరి, 2013

© అన్ని హక్కులూ రచయితవి

నగ్నముని

'రవి ఎపార్ట్‌మెంట్స్' 16-11-1/2 ఫ్లాట్ నెం - 101

సలీం నగర్, మలక్‌పేట, హైదరాబాద్-36

ముఖచిత్రం : రమణ జీవి

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

హైదరాబాద్

For copies

Kinige

www.kinige.com

వెల: రూ. 60/-

నగ్నముని - cell - 9441081922

●

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| అభినందనాలు | : | | 4 |
| విలోమకథ! | | | 5 |
| ఆకాశదేవర | : | | 9 |

అనుబంధం

| | | | |
|---|---|---|---|
| Aakasa Devara.. A modern parable | : | Prof. C.Subba Rao | 45 |
| ఆకాశదేవర - నగ్నముని - విలోమకథ | : | ప్రొఫెసర్ సి.సుబ్బారావు | 49 |
| విలోమ వ్యవస్థ... అనులోమ కథ | : | శ్రీ కె.శ్రీనివాస్ | 52 |
| అబద్ధాల సత్యం - నగ్నముని ఆకాశదేవర.. | : | శ్రీ వై.వేణుగోపాల్ రెడ్డి | 58 |
| సామాజిక విపర్యాల సంగ్రహం - నగ్నముని విలోమకథ ఆకాశదేవర | : | శ్రీ విహారి | 63 |
| రేఖా మాత్రంగా... | | | 70 |


●

ముఖ్యంగా-

శ్రీ దేవినేని మధుసూదన రావు

ప్రొఫెసర్ సి.సుబ్బారావు

శ్రీ కె.శ్రీనివాస్

శ్రీ వై. వేణుగోపాల్ రెడ్డి

శ్రీ విహారి

శ్రీ చిలుకూరి సురేష్

శ్రీ రమణ జీవి

వీరందరికీ ఆకాశదేవర అభివందనాలు

# విలోమ కథ!

విలోమం అంటే తలకిందులు, అపసవ్యం.

ప్రభుత్వాలు, సమాజాలు కొన్ని ఆరోగ్యకరమైన, ఆధునికమైన, నాగరీకమైన, ప్రజాస్వామ్యకమైన విలువలపై నడుస్తాయి. ఆ విలువలు అస్తవ్యస్తమైతే దానిని ప్రభుత్వం అనరు, సమాజం అనరు, పిచ్చాసుపత్రి అంటారు. అక్కడ విలువల ప్రసక్తి వుండదు. పరస్పరవైరుధ్యాలు బాహాటంగా రాజ్యమేలతాయి.

మన వ్యవస్థల్లోని పరస్పర వైరుధ్యాలు, అస్తవ్యస్థల గురించి విలోమ కథ చెబుతుంది.

ప్రభుత్వశక్తి అపారమైనది, సర్వోత్తమమైనది. ఆ శక్తితో అద్భుతాలు సృష్టించవచ్చు. అభ్యుదయాన్ని ప్రతి యింటి ముంగిట్లోకి తీసుకు రావచ్చు. మనిషినే విప్లవీకరించవచ్చు.

కాని, అసమర్థ ప్రభుత్వం తన అసమర్థను కప్పిపుచ్చుకునేందుకు, ఆ విషయం తెలియనివ్వకుండా సమాజాన్ని నియంత్రిస్తుంది. అణచివేస్తుంది. తన చెప్పుచేతల్లో పెట్టుకోడానికి ప్రయత్నిస్తుంది. క్రూరంగా సమాజాన్ని వికృతం చేస్తుంది. అరాచకాన్ని ప్రేరేపిస్తుంది. అవినీతి, అరాచకం, బీభత్సం, మనిషిని మనిషి కానివ్వనితనం ప్రభుత్వం నుంచి వచ్చినవే.

మొరట ప్రభుత్వం తన అసమర్థతతో తాను అవినీతిమయమై, క్రమంగా సమాజాన్ని అవినీతిలో ముంచివేసింది. తాను అరాచకమై తరువాత సమాజంలో అరాచకం రాజేసింది. క్రమంగా ఒక్కొక్కటీ రాజకీయ, ఆర్థిక మొదలైన అన్ని ఆరోగ్యకరమైన విలువలను అమానవీయ, మొరటు, వికృత విలోమ విలువటుగా మార్చింది. వీటిపై సొగసైన ముసుగులు కప్పి నాగరికత, ఆధునిక, ఆధునిక, అభివృద్ధి, పురోగతి వంటి పదజాలంతో ప్రచారం చేసి, ప్రజల మైండ్‌సెట్ మార్చింది. ఇదంతా నిజమేనని భ్రమింపచేసింది. అన్నీ నమ్మే విధంగా ప్రజలను తయారుచేసింది. మనుషులను సహజస్పందనలు గల మనుషులుగా మననివ్వకుండా చేసింది. వాళ్ళు తాముగా కాకుండా మరొకళ్ళుగా ఆలోచించే, ప్రవర్తించే వాళ్ళుగా తయారుజేసింది. ఈ వికృత క్రమాన్ని తెలియచేసేదే విలోమ కథ

●

విలోమ కథారచన 1975 జూన్ 25 అర్ధరాత్రి విధించబడి 18 నెలలు నిరాటంకంగా కొనసాగిన ఎమర్జెన్సీ కాలంలో ప్రారంభమైంది.

ఎమర్జెన్సీ - అత్యయిక పరిస్థితి అంటే - దమననీతితో నిర్బంధ, నిరంకుశపాలన. రాజ్యాంగానికీ, చట్టాలకూ, న్యాయస్థానం తీర్పుకు, మానవత్వానికి గౌరవం లేని పాలన. పత్రికలు గొంతు నొక్కి, ఆలోచనాపరులను, ప్రజాస్వామికవాదులను అరెస్టు చేసి, జైళ్లలో బంధించి మొత్తం దేశాన్ని స్మశానంగా మార్చిన కాలమది.

ఆ కాలంలోనే విలోమ కథల రచన ప్రారంభమైంది. సెన్సారు అధికారుల బంధనాలు దాటి ఆరుకథలు మాత్రమే వెలువడ్డాయి. ఆ తరువాత అవి ఒక పుస్తకంగా వచ్చాయి.

18 నెలల తర్వాత ఎమర్జెన్సీ ఎత్తివేసినా, ఆ తరువాత కూడా పరోక్షంగా ఆనాటి కరడుగట్టిన నియంతృత్వ లక్షణాలతోనే పరిపాలన కొనసాగింది. వంశపారంపర్యం, అవినీతి, అరాచకం, అసమర్థత విరాట్ రూపంలోని వీటన్నింటికి ప్రజలు క్రమంగా అలవాటు పడేట్లు చేసింది.

సామ్రాజ్యవాద పడగకింద ప్రపంచీకరణ అభివృద్ధి మంత్రంతో సామాన్యులు జీవనభారాన్ని యింక ఏమాత్రం మొయ్యలేని స్థితిని తీసుకు వచ్చింది. ఈ దేశాన్ని అమ్మెయ్యడం జరిగింది.

అనేక రాజకీయ, ఆర్థిక వ్యూహాల్లో ప్రజలు యివాళ బంధీలై వున్నారు. ఈ చదరంగంలో పావులుగా మార్చబడ్డారు. ఆ విషయం వాళ్లకు తెలీని, తెలియనివ్వని ఒక నవీన మార్మిక వాతావరణం వాళ్ల మెదళ్లను ఆక్రమించేట్లు చేయడం జరిగింది. ప్రత్యామ్నాయం గురించిన ఆలోచన రానివ్వని పరిస్థితిని పకడ్బందీగా కల్పించడం జరిగింది.

ఈ ప్రభుత్వం అసమర్థతలోంచి, ప్రజల బలహీనతలను బాహాటంగా వుపయోగించుకుని స్వైరవిహారం చేసే కార్పొరేట్ శక్తులెన్నో బయల్దేరినై.

ఈ దేశమనే సీసా బెరడు తియ్యడం జరిగింది. అందులోంచి అనేక ముఖాల, అనేక అంగాల భూతాలు పొగల్లోంచి బయటకొస్తున్నయ్. వాటిని తిరిగి సీసాలో బంధించడమెలాగో!

●

ఒకప్పుడు విలువలు విలోమమైనాయని, మనుషులు మనుషులుగా బతకడం లేదని, తమ సొంత మెదళ్లతో, సొంత అవయవాలతో ఆలోచించడం లేదని, వ్యవహరించడంలేదని, యితరుల అంగాలతో, మెదళ్లతో బతికేస్తున్నారని చెప్పడం జరిగింది.

ఇప్పుడు మనుషులు, సమాజం, ప్రభుత్వం - వాటిని, వారిని నడిపే వ్యవస్థలన్నీ తలకిందులైనై. ఈ విలోమమే సక్రమమని, సత్యమని నమ్మే స్థితి ప్రజల్లో ఏర్పడింది. ఇది పరాకాష్ఠ. ఎమర్జెన్సీ కాలంలో సెన్సార్ అధికారుల దృష్టిని తప్పించుకుని ప్రతీకాత్మకంగా, నిగూఢంగా రాయడం జరిగింది. ఇప్పుడు ఆ శైలిని కొంత సడలించి, కథ మరింత వివరంగా అర్థం కావాలని విలోమ వాస్తవికతకు, విలోమ కథావస్తువుకు ప్రాధాన్యత యివ్వడం జరిగింది.

అయితే, యింతవరకు చెప్పిన దానిలో, ఆకాశదేవర, దాని నిర్మాణం, తాత్వికత, యీ యుగానికి చెందిన పాత్ర మిస్టర్ కారష్ గురించి వివరణాత్మకంగా ఏమీ చెప్పలేదు. కథారచన నేపథ్యం మాత్రమే సూచన ప్రాయంగా చెప్పడం జరిగింది.

సాధారణంగా, ఒక రచన చదవడం పూర్తిచేసింతర్వాత, పాఠకుని ఆలోచనా ప్రయాణం అక్కడ నుంచి ప్రారంభమవుతుంది.

ఆకాశదేవర అదే ఆశిస్తున్నది.

నగ్నముని

●

# ఆకాశదేవర

ఓ పిట్ట రెట్ట వేసింది. నిటారుగా నేలపై పడింది. మన్నును ఆశ్రయం కోరింది. వాన చినుకు దాన్ని వెంబడించి కౌగిలించుకుంది. రెండూ పరవశత్వంలో ఒక్కటై మఱ్ఱిచెట్టుగా మారింది. నలుగురికీ నీడనిచ్చింది. కొమ్మలకీ రెమ్మలకీ ఆకులకీ ఊసులు చెబుతూ పక్షులు కిలకిలలాడాయి. పక్కనే పొలాలు తడుపుతూ సన్నాయిలా ప్రయాణించే కాలవ. హఠాత్తుగా జబర్దస్తీగా మొత్తం వాతావరణం ఓ రాజకీయ నాయకుడి ఆక్రమణలోకెళ్లింది. ఏదో సొంత ప్రాజెక్టుకి అడ్డంగా వున్నదని మఱ్ఱిచెట్టు అడ్డంగా నరికివేయబడింది.

ఓ పిట్ట రెట్ట వేసింది. అడవిలో ఎర్రబడి ఎర్రచందనమైంది. అర్ధరాత్రి దొంగదారిలో ప్రవేశించిన గొడ్డళ్లు కర్కశంగా పైనబడి ఖండఖండాలుగా దుంగలు దుంగలుగా నరికివేయబడింది. ప్రాణం నిలుపుకుంటూ చివుళ్లతో తలెత్తినప్పుడల్లా నరకబడుతూనే వుంది. అడ్డం వచ్చిన నిజాయితీ ధరించిన కాపలాదార్ల ప్రాణాలు తీస్తూ బాహాటంగా లారీల్లో సరిహద్దులు దాటుతూనే వుంది.

ఓ పిట్ట రెట్ట వేసింది. గంజాయిగా మారింది. వనంగా విస్తరించింది. ప్రజాభక్షకుల రక్షణలో చాటు మాటుగా పెరుగుతోంది. రూపాయిగా డాలర్‌గా ప్రపంచ వివిధ కరెన్సీగా పూత పూస్తూ అమితప్రియంగా పెరుగుతోంది.

యువత రక్తంలోకి తాచులా జరజర జారి విషం చిమ్ముతూ శరీరమంతా కాళ్లు వేస్తూ ఉన్మత్త నృత్యంతో నోరు తెరిచిన మృత్యులోకమై వ్యాపిస్తోంది.

ఓ పిట్ట రెట్ట వేసింది. అది మనిషి తలమీద పడింది. తుడిచినా, జుట్టులో చిక్కిన కొన్ని రేణువులు మెదడులోకి దిగి 'కార్నివోరస్' మొక్క మొలిచింది. అతనే ఆ చెట్టుగా లోపల ఎదుగుతున్నాడు. 'కార్నివోరస్' మాంసాహారి. నరమాంసం యిష్టంగా తింటుంది. నీడకు చేరినవారినో, దారినబోయే వారినో ఆకర్షించి, కొమ్మలతో కౌగిలించి, ప్రేమగా ఎముకలు విరిచి, మాంసం ముద్దచేసి భక్షిస్తుంది. హాయిగా, సులువుగా జీర్ణం చేసుకుంటుంది.

మొదట్లో పిట్ట వేసిన రెట్ట, మనిషి తలమీద పడినప్పుడు, దాన్ని తుడిచినప్పుడు, గాలిలో వ్యాపించిన మరికొన్ని రేణువులు మరికొన్ని తలలపై వాలి మెదళ్లలోకి యింకినై.

మనుషుల్లో కార్నివోరస్ మనుషుల్ని పోల్చుకోడం కష్టం.

• • •

యువ ఆర్కాలజిస్టు ఈశ్వర శర్మ 'మిలియన్ లైట్స్' చేరేప్పటికి ఉదయం పదకొండున్నర అవుతోంది. మిస్టర్ కారష్ ఆఫీసుకి పదకొండు గంటలకే వస్తాడని యింతకుముందు విని వున్నాడు. లిఫ్ట్ అతన్ని పైకి తీసికెడుతోంది.

'మిలియన్ లైట్స్' నాటి మహారాజాల పాలెస్‌లను మరిపించే ఫైవ్‌స్టార్ హోటల్. నేలమీద చుట్టూ పచ్చగా పరిచిన తివాచీలా పచ్చిక. మధ్యలో దర్పంతో ఠీవిగా నిలువెత్తు రాజసంతో నిలబడిన, అంచెలంచెలుగా ఫ్లోర్స్‌తో ఆధునిక భవనం. దూరం నుంచి చూస్తే మేఘాల్ని ముద్దాడుతున్నట్లు, దగ్గరకొస్తే అతుకులు కనబడని అద్దాల తాపడంతో మిలమిలలాడే పోతపోసిన గాజు శిల్పం. పగలు సూర్యుడు ఆ అద్దాల్లో తనని ధగధగమంటూ చూసుకుంటూ ప్రయాణిస్తాడు. కిరణాలు సూటిగా తీవ్రంగా అద్దాల్ని ఢీకొని

ఆ ప్రాంతాన్ని జిగేల్మనిపిస్తాయి. రాత్రివేళ చంద్రుడు, తారలు అద్దాల్లో ప్రతిబింబించి వినువీధిని నేలపైకి తీసుకొస్తారు. ఆ నిర్మాణం ఒక మిరకిల్. ఆ హెూటల్లో దిగడం స్టేటస్ సింబల్.

'మిలియన్ లైట్స్' ఆరో ఫ్లోర్‌లో మిస్టర్ కారష్ సూట్ ముందు వరండాలో లోపలినుండి పిలుపుకోసం ఎదురుచూస్తూ పచార్లు చేస్తున్నాడు ఈశ్వరశర్మ.

మిస్టర్ కారష్ వయసు మూడు పదులు పూర్తిగా నిండకపోయినా ఆధునిక వాణిజ్య వీధిలో అతనొక వండర్. అతని గదిలోకి ఎవరికి బడితే వాళ్లకి ఎప్పుడుబడితే అప్పుడు ప్రవేశం దొరకదు. దొరికిందంటే, విషయం అత్యంత ముఖ్యమైనదీ, ఖరీదైనదీ అయివుంటుంది.

మిస్టర్ కారష్‌కి హైదరాబాద్‌లోనే ఆరు బిల్డింగ్స్ వున్నయ్. కుటుంబాల నివాసానికీ, వ్యాపారాల కంపెనీలకీ, యితరత్రా ఏ ఆఫీసులకీ ఎవరికీ వాటిని అద్దెకు యివ్వలేదు. ఖాళీగానే వుంటయ్. వాటి చుట్టూ కోట గోడలు. గేటు దాటితే ఆహ్వానిస్తూ పరిమళం వెదజల్లుతూ పూలమొక్కలు. ప్రవేశిస్తే లోపల కార్పెట్లు, జాలువారే అభిరుచితో గోడలపై పెయింటింగ్స్, సీలింగ్ నుండి వేలాడుతూ షాండ్లియర్లు. వాటిలోకి అతనే అప్పుడప్పుడు వెళ్లి వస్తూ వుంటాడు. అయితే, ఏ బిల్డింగులో ఎప్పుడు ఏ సమయంలో వుంటాడో అతనికి తప్ప మరెవరికీ తెలీదు. అతను పెళ్ళికానివాడు. చేసుకునే వుద్దేశం వున్నట్లు కనబడదు. మరి, యిన్ని బిల్డింగ్స్ ఒక్కడికి ఎందుకో ఎవరికీ తెలీదు. మూడ్స్‌ని బట్టి అయా భవనాల్లో వుంటూ వుండవచ్చు. ఈ విషయాలు బహుశా సత్యానంద్‌గారికి కొంతయినా తెలిసి వుండవచ్చు.

'మిలియన్ లైట్స్' ఆరో ఫ్లోర్‌లోని సూట్‌లో వున్నది మిస్టర్ కారష్ పర్సనల్ ఆఫీస్. అక్కడికి కూడా అతను రోజూ రాడు. అప్పుడప్పుడూ వచ్చి వెడుతుంటాడు. ఆ ఆఫీసులో అతని సెక్రెటరీ శ్యాంసుందర్ తప్ప ఎవరూ వుండరు. శ్యాంసుందర్ ఆఫీసుకి తప్పకుండా రోజూ రావాలి. ఉదయం పదిగంటలకి వచ్చినప్పుడు, సాయంత్రం ఆరుగంటలకి వెళిపోతున్నప్పుడు,

మధ్యలో ఏదయినా ఆఫీసు పనిమీద ఎక్కడికయినా వెళ్లవలసి వచ్చినప్పుడు మొబైల్‌లో చెప్పివెళ్లాలి. అంటే అతని కదలికలు కారష్‌కి తెలుస్తూ వుండాలి.

మిస్టర్ కారష్ దగ్గర రెండు మొబైల్స్ వుంటాయి. ఒక దానిపై జనరల్‌గా వ్యవహరిస్తాడు. రెండో నంబర్ అతికొద్ది మందికి మాత్రమే తెలుసు. అది చాలా చాలా వ్యక్తిగతం. మిస్టర్ కారష్ శ్యాంసుందర్‌ని 'షా' అని సంబోధిస్తాడు. షాకి కూడా యీ రెండో మొబైల్ నంబర్ తెలీదు. అది ఉన్నట్లు కూడా తెలీదు.

మిస్టర్ కారష్ ఆఫీసులో వున్నప్పుడు జ్యూస్‌గాని, లంచ్‌గాని, లిక్కర్‌గాని యితరత్రా అతని అవసరాలు షాకి క్లుప్తంగా ఇంటర్‌కాంలో చెబుతాడు. వాటిని మరో రూంలో హొటల్ స్టాఫ్‌తో షా ఏర్పాటు చేయిస్తాడు. పురుషులుగాని, స్త్రీలుగాని అతన్ని కలుసుకోడానికి వచ్చినవారిని ఎవరిని ఏ రూంలోకి పంపాలో, వారికి చెయ్యవలసిన గౌరవ ఆతిథ్య ఏర్పాట్ల గురించి చెబుతాడు. ఆర్డర్సు యివ్వడం తప్ప షాతో యింకేమీ మాట్లాడడు. వ్యక్తిగతంగా కలుసుకోవలసిన అవసరం రానివ్వడు. జీతం కూడా ప్రతి నెలా ఒకటవ తేదీనే షా బ్యాంక్ ఎకౌంట్‌లో జమ అయిపోతూ వుంటుంది. కక్కుర్తి వుండదు. పెద్ద జీతమే. దీనివల్ల షాకి తన యజమాని గురించి తెలిసింది బహు తక్కువ. ఆశ్చర్యాలే ఎక్కువ. అయినా, అతనొక ఇంటర్నేషనల్ పర్సనాలిటీ దగ్గర పని చేస్తున్నాననే వాతావరణం అంతటా వుంటుంది.

మిస్టర్ కారష్ పూర్తిపేరు కానువేలు రవిప్రకాష్. ఇంటి పేరులోని మొదటి అక్షరం, పేరులోని మొదటి, చివరి అక్షరాలు కలిపి కారష్‌గా వ్యవహరిస్తాడు. ఇది చాలామందికి తెలీదు. షాకి కూడా తెలీదు. సత్యానంద్‌గారికి తెలుసు.

ఆఫీసులో షా చెయ్యవలసిన రోజువారీ పనుల్లో ముఖ్యమైనది - న్యూస్ పేపర్సులో, జర్నల్స్‌లో, యానిమల్ బుక్స్‌లో అడవి క్రూర జంతువుల గురించిన వార్తలు, విషయాలు, ప్రవర్తన వివరాలు మొదలైనవి సేకరించి

ఫైల్ చెయ్యాలి. వాటిని మిస్టర్ కారష్ స్టడీరూంలో పెట్టాలి. అవి ఎందుకో షాకి తెలీదు. ఇటువంటి పనులే మరికొన్ని వున్నాయి. ఇవన్నీ షాలో మిస్టర్ కారష్ గురించి తెలుసుకోవాలనే కుతూహలం పెంచుతూ వుంటాయి. మొబైల్‌పై గాని, ఇంటర్‌కాంలో గాని ఆర్డర్సు యిస్తున్నప్పుడు అతని గొంతులోని మాడ్యులేషన్స్ ద్వారా వెలువడే ఆనందం, విచారం, కోపం తాపం మొదలైన మూడ్స్ పట్టుకోడానికి, తద్వారా దగ్గర కావడానికి ప్రయత్నిద్దామనుకునేవాడు. కాని, అది సాధ్యమయ్యేది కాదు. ఎందుకంటే, కారష్ స్వరం మనోభావాలకు దూరంగా, మంద్రస్థాయిలో ఒకే రకంగా, ఒకే విధంగా వుంటుంది. ఆ మాట్లాడేది కూడా పొడిపొడిగా కాసిని పదాలు మాత్రమే.

చూచాయగా షా వుద్దేశంలో సత్యానంద్‌గారికి అన్నీ తెలిసి వుంటాయి. ఎందుకంటే యిద్దరూ ఒకే వూరి వాళ్లు. ఎలిమెంటరీ స్కూలుమేట్స్. ఈయనికి ఆయన బహిఃప్రాణం. ఆయన కొక్కడికే యీయన పర్సనల్ రూంలోకి ముందస్తు అనుమతి లేకుండా ప్రవేశం వుంటుంది.

● ● ●

షా చేస్తున్న పని ఒక కొలిక్కి వచ్చిన తర్వాత బయటికి వచ్చాడు. కారిడార్లో వున్న ఈశ్వర శర్మను ఆఫీసులోకి ఆహ్వానించాడు. మిస్టర్ కారష్ గారితో పని ఏమిటని అడిగాడు.

'ఆకాశదేవర' దేవాలయంపై పరిశోధించి నేనో గ్రంథం రాశాను. ఇతర గ్రంథాల్లో లేని వివరాలెన్నో నేనిందులో యిచ్చాను. ఈ గ్రంథాన్ని నేను అచ్చు వేయించాను. వారికో కాపీ యిద్దామని, ఆ దేవాలయం, స్థలపురాణం మొదలైన విషయాల గురించి వారితో స్వయంగా మాట్లాడదామని వొచ్చాను' అన్నాడు శర్మ వినయంగా.

ఇంటర్‌కాంలో మిస్టర్ కారష్‌కి యీ విషయం చెప్పాడు షా.

ఆ పుస్తకం తీసుకుని తన స్టడీ రూంలో పెట్టమన్నాడు కారష్.

'మీతో స్వయంగా మాట్లాడదామనుకుంటున్నాడు' అన్నాడు షా.

'ఇప్పుడు కుదరదు. మరోసారి. పిలుపు వస్తుంది' అని సమాధానం.

వెంటనే కలవలేకపోయాననే నిరాశ, తిరిగి మరోసారి పిలుపు వస్తుందనే ఆశ. షా తెప్పించిన పండ్ల రసం తాగి, థ్యాంక్స్ చెప్పి, తనని పిలవడం మరచిపోవద్దని కోరుతూ వెళ్లాడు శర్మ.

ఒక గంట తర్వాత, తన పర్సనల్ రూంలో రివాల్వింగ్ చైర్‌లో మిస్టర్ కారష్. ఒక చేతిలో వజ్రం మెరుపుల క్రిస్టల్ గ్లాస్‌లో రాయల్ శాల్యూట్ విస్కీ. దానిలో తేలుతున్న ఒక ఎర్రటి ద్రాక్ష పండు. అతని పెదవుల్ని ఎర్ర ద్రాక్ష తాకుతూ వుండగా, విస్కీ బిందువులు గొంతులోకి జారుతున్నాయి. మరో చేతిలో 'ఆకాశదేవర' గ్రంథం.

● ● ●

ఒకప్పుడు అది కాలిబాట కూడాలేని దట్టమైన అడవి. వేటగాళ్లు, పశులకాపర్లు కూడా అడుగు పెట్టడానికి సాహసించలేని కీకారణ్యం. ఆ దండకారణ్యం మధ్యలో ఒక కొండ. ఆ కొండమీద ఒక చిత్రవిచిత్రమైన ప్రాచీన కాలం నాటి దేవాలయం. ఏ రాజుల పాలనాకాలంలో ఎవరు దానిని నిర్మించారో తెలీదు. దానికి గాలిగోపురం, ధ్వజస్తంభం మొదలైనవేవీ లేకపోవడంవల్ల అక్కడో గుడి వున్నట్లు బయట ప్రపంచానికి తెలీదు. అది గుడిలా కనిపించదు. కాని అది గుడి. సంప్రదాయ బద్ధమైన నిర్మాణ లక్షణాలేమీ లేని గుడి. ఒకరకంగా గుడి అనే భావనకే అతీతమైనగుడి. ఒకప్పుడు కొండల్లో కోనల్లో నివశించే జనాల ఆటల పాటల మాటున దాగిన ఆలోచనలకు దగ్గరగా వుండే గుడి అయివుండవచ్చు.

ఒకరోజున పొడుగాటి వెండి తీగల గడ్డంతో, చిక్కనైన అనుభవాలు నెమరు వేసే వయసుగల ఓ పెద్దాయన వూరి బొడ్రాయి దగ్గర నలుగుర్నీ కూడదీసి ఒక విషయం ఆసక్తికరంగా చెప్పాడు.

'నాయనా, అప్పుడప్పుడూ నిద్రలో నాకో కల వస్తున్నది. అదీ పగటి నిద్రలో కాదు, తెల్లవారుఝూమున వస్తున్నది. మొదట్లో దాన్ని నేను

పట్టించుకోలేదు. అందువల్ల లేచిన తర్వాత గుర్తుండేది కాదు. కాని, ఒకే రకంగా, గుర్తుండేంత వివరంగా చాలాసార్లు వచ్చింది. ఆ కలలో మొదట అంతా పొగ కమ్ముకుంటుంది. తర్వాత తీవ్రంగా గాలి వీస్తుంది. సుడిగాలి. అది క్రమంగా తగ్గుతూ వుండగా ఆకాశంలో మేఘాలు అనేక రూపాల్లో కరులుతూ వెళుతుంటాయి. తర్వాత మెరుపులు మెరుస్తాయి. ఆకాశంలో ధ్వనులు వస్తాయి. దానిలోంచి గోళాకారంలో కాంతి, దాన్లోంచి స్త్రీ కంఠం విను విను అంటూ నెమ్మదిగా, అనునయంగా ఒక విషయం చెబుతూ వుంటుంది. అంటే, సరిగా అర్థం చేసుకుంటే, ఆకాశవాణి మాట్లాడుతున్నదన్నమాట.

ఆకాశవాణి చెప్పిన విషయం ఏమిటంటే – ఆ అడవిలోని కొండమీద జీర్ణావస్థలో ఓ గుడి వున్నదట. అది గుడి అంటే నమ్మశక్యం కాని విధంగా వుంటుందట. శతాబ్దాల క్రితం కట్టినదట. అది గొప్ప పుణ్యస్థలమట. మహర్షులు తపస్సు చేసుకోడానికి అక్కడికి వచ్చేవారట. క్రమంగా రాజ్యాధీశులు మారి, అంతఃకలహాలు చోటు చేసుకుని, చరిత్రలో ఎన్నో మార్పులు వొచ్చి, తరాలు మారి, దాని వునికే మరుగున పడిపోయిందట. ఆ గుడి అనేక ప్రతీకలకు ఆలవాలమై జనాలకు సకల శుభాలు కలగజేస్తూ వుండేదిట.

ఇంక, ఆ గుడి ఎలా వుంటుందో దాని నిర్మాణం గురించి కూడా చెప్పింది. కొండమీద తూర్పుకి అభిముఖంగా రెండు గదుల కట్టడమొకటి వుంటుంది. ఆ రెండు గదులే ఆ దేవాలయం. ఆ గదులు పక్కపక్కన వుండవు. రెండూ కలిసి వుంటాయి. ఒకదాని వెనుక మరొకటి వుంటాయి. ముందుగది చిన్నది. రెండవది, వెనుక ఆనుకుని వున్నది కాస్త పెద్దది. రెంటికీ ద్వారాలు వుంటాయి. తలుపులు మాత్రం వుండవు. దేనిలోనూ విగ్రహాలు వుండవు. దేనిలోనూ దీపం వుండదు. దీపం పెట్టకూడదు. ధూపదీప నైవేద్యాలు వుండవు. ఇవన్నీ ప్రతీకలే. ఈ ప్రతీకలను విశదీకరిస్తే అనేక నిగూఢ సత్యాలు వెల్లడవుతాయి.

ఆకాశవాణి మరికొన్ని మహామార్మిక విషయాలు చెప్పింది. అవేమంటే

- మనిషి తనని గురించి అంతా తెలుసుననుకుంటాడు. మనిషికి మనిషి గురించి తెలీదు. మనిషి మహాశూన్యంలో జీవిస్తూ వుంటాడు. అలాగే, మనిషి లోపల కూడా శూన్యం వుంటుంది. శూన్యం అంటే ఆకాశం. మనిషి లోపల ఆకాశం వుంది. అంతర్ బహిర్ ఆకాశ శక్తిలోనే మనిషి అస్తిత్వం వుంది. ఈ ఎరుక వల్లనే మనిషికి మూలజ్ఞానం లభిస్తుంది. ఆ మౌలిక జ్ఞానమే మనిషికి స్వస్వరూపశక్తినిస్తుంది. ఆ అదృశ్య శక్తి మనిషిని సకల శుభాల వైపు నడిపిస్తుంది. ఆ ఆకాశ జ్ఞానానికి ప్రతీకే యీ గుడి.

మొదటి గది భౌతిక శూన్యానికి చెందింది. రెండవ గది అధిభౌతిక శూన్యానికి చెందినది. అక్కడ పూజలు పునస్కారాలు చెయ్యవలసిన పని లేదు. ఎరుకే అన్నింటికీ మూలం. దానినే చేరుకోవాలి. ఆ జ్ఞానేంద్రియాన్నే సాధించాలి. కొండమీద ఎప్పుడూ నిశ్శబ్దం పాటించాలి. ఎందుకంటే, అన్ని శబ్దాలనూ తనలోకి పీల్చుకుని వున్నదే నిశ్శబ్దం. ముందుగా, ఎవరయినా సరే, మొదటి గదిలో, నిశ్చయంగా, నిర్మలంగా, తదేక దృష్టితో శూన్యాన్ని గురించి తలుచుకుంటూ కాసేపు కూర్చోవాలి. తరువాత, మహాశూన్యం గదివైపు చూస్తూ బయటికి రావాలి. ఈ శూన్యత్వం గురించిన తలపు, మహాశూన్యంవైపు సారించిన దృష్టి - రెండూ కలిసి క్రమంగా మనిషి మానసికానుభవంలోకి ఆకాశతత్వం పురి విప్పుకునే అవకాశం వుంది.

ఈ శూన్యత్వమే మనిషి మనుగడ లోపల, బయట ఆవహించి వున్న బరువులనన్నింటిని తొలగిస్తుంది. దీనిని గ్రహించిన వారు జ్ఞానులవుతారు. మనిషికీ, శూన్యత్వానికీ మధ్య ఎటువంటి అడ్డంకులూ వుండకూడదనే భావనతోనే యీ గదులకు తలుపులు వుండవు. శూన్యానికి, అంటే ఆకాశానికి ఆకారం వుండదు. అందువల్లనే యీ గదుల్లో విగ్రహాలుండవు. దీపం వుండదు. ఎందుకంటే - మనిషే దీపం. అది తెలుసుకుంటే చీకటి వుండదు. ఇవన్నీ ప్రతీకలే.

వెళ్లు. ఆ కోవెలను వుద్ధరించు. పదిమందికీ తెలియజెయ్యి. జనాన్ని శుభాలవైపు నడిపించు' అంటూ ఆకాశవాణి అదృశ్యమైంది.

'నాయనా, యిదీ నాకు చాలాసార్లు వచ్చిన కల. ఈ పని నా ఒక్కడి వల్ల అయ్యే పని కాదు. అరణ్యంలోకి వెళ్లడం, కొండెక్కడం, అసలు నిజంగా అక్కడ అటువంటి దేవాలయం వున్నదీ లేనిదీ తెలుసుకోడం నా వల్ల కాదు. పదిమందిమీ కలిసి చేస్తే గాని యిది సాధ్యం కాదు' అన్నాడాయన.

చుట్టూ చేరిన వాళ్ల మనసులో ఆసక్తి బీజం పడింది. తరువాత, ఆ నోటా ఈనోటా మరింత మందికి తెలిసింది. నలుగురు కలిసినప్పుడల్లా యిదే అనుకున్నారు. చివరికి తప్పకుండా యీ పని చెయ్యాలి అని నిశ్చయించుకున్నారు. అదే ఆయనకు చెప్పారు. ఓ మంచి ముహూర్తాన, ఆ పెద్దాయన ఆధ్వర్యంలో చెట్లు నరికి దారి చేసుకోడానికి, జంతువుల నెదుర్కోడానికి, కొండెక్కడానికి, రెండు మూడు రోజులు దీనిని సాధించడానికై గడపడానికి సిద్ధమై, దివిటీలు, కర్రలు, పారలు, గునపాలు, గొడ్డళ్లు, బరిసెలు, తాళ్లు, నిచ్చెన, దొరికినన్ని ఆయుధాలు, బుజాలకు అన్నాలు, నీళ్లు వేసుకుని ఓ వందమందిదాకా బయల్దేరి, జంతువులను భయపెట్టడానికి డప్పులు కొట్టుకుంటూ, అరుస్తూ, దివిటీలు వెలిగించి అడవిలోకి ప్రవేశించారు.

అడ్డదిడ్డంగా మొలిచిన ముళ్లచెట్లు అల్లుకున్న తీగలు చెట్లు మహా వృక్షాలు పుట్టలు పాములు విషకీటకాలు కోతులు ఎలుగ్గొడ్లు పెద్ద పులులు నక్కలు మొదలైన వాటితో, వూహించిన కష్టాలు పడ్డారు. ధైర్యంగా అడ్డమున్నవాటిని నరుక్కుంటూ దారి చేసుకుంటూ అరుపులతో, దివిటీ జ్వాలలతో ముందుకెళ్లారు. అవి వెన్నెల రోజులు కావడం వల్ల పగలు సూర్యుడు, రాత్రి చంద్రుడు దారి చూపించారు. అక్కడక్కడా విరక్కాసిన పళ్ల చెట్లు. తేట నీటితో దొరువులు. అవి ఆకలినీ, దాహాన్నీ తీర్చాయి. అసలు అడవి బతుకే బావుంది అనుకునేంతగా తీర్చాయి. ఒక పగలు, ఒక రాత్రి నడిచాక కొండ దగ్గరకొచ్చారు.

గట్టి రాళ్లమీద పాదాలు మోపి, జారకుండా ఒకర్నొకరు గట్టిగా పట్టుకుంటూ రెండోరోజు మధ్యాహ్నానికి కొండమీదకు చేరారు. స్వప్నంలో చెప్పినట్లుగానే కొండమీద పాడుపడిన రెండు గదుల కట్టడమొకటి వుంది.

ఎండకు ఎండీ, వానకు నానీ బురదగట్టిపడి బూజుపట్టి, కంప యిష్టమొచ్చినట్టు పడి వుంది. ఆ కట్టడాన్ని చూడగానే పెద్దాయనలో ఆనందం కట్టలు తెగింది. 'అమ్మా', ఆకాశవాణమ్మా, నువ్వు చెప్పినట్టే వుందమ్మా, శూన్యం గుడి వుందమ్మా, మమ్మల్ని రక్షించడానికే కలలో కొచ్చావమ్మా, తల్లీ, మహాతల్లీ' అంటూ ఆకాశంవైపు చూస్తూ, నమస్కరిస్తూ పారవశ్యంతో బిగ్గరగా అరుస్తూ వూగిపోయాడు. అందరూ అయనలాగే దణ్ణాలు పెడుతూ గెంతులేశారు. నేలమీద దొర్లారు.

తరువాత, పెద్దాయన కొందరిని పిలిచి ఆ గుడి బయట, లోపల గోడలపై పేరుకుపోయిన దుమ్ము ధూళి తొలగించి గుడ్డతో తుడిపించాడు. లోపల నేలమీద చెత్తనంతా చేతుల్తో ఎత్తిపోశారు. ఈ పని చేస్తున్నప్పుడు రెండు పాములు బుస కొట్టుకుంటూ బయటికొచ్చి కొండరాళ్లలోకి జారిపోయాయి. మహాశూన్యం గదిలోంచి నాలుగైదు గబ్బిలాలు ఎగురుకుంటూ చెట్లమీదకెళ్లిపోయాయి. ఎవరూ వీటిని లక్ష్యపెట్టలేదు. అంతా ఆశ్చర్యంలో, ఆనందంలో వున్నారు. కొండమీదే ఒక మూల అల్లంత దూరంలో ఒక దొరువు వుంది. దాన్నిండా నీళ్లు వున్నాయి. ఆ నీటితో గుడి గోడలు తుడిచారు. దానితో అస్పష్టంగానైనా కొన్ని అంశాలు బయటపడ్డాయి. గోడలపై అడవుల్లోని చెట్ల ఆకులు, బెరళ్లు, మూలికలతో తయారుజేసిన రంగులతో వేసిన బొమ్మలున్నాయి. మొత్తం గోడలు ఆకాశం లేత నీలిరంగులో ముంచెత్తినట్లు వున్నాయి. వాటిపై ఎరుపు, ఆకుపచ్చ, పసుపు పచ్చ, దట్టమైన నీలం యితర రంగుల్లో చిత్రమైన గీతల్తో మనుషులు, జంతువులు, పువ్వులు ఆకులు లతలు వున్నాయి. సింహాలు, పెద్ద పులులు, ఎలుగుబంట్లు మొదలైన జంతువులు వెనకాళ్లపై మనుషుల్లానే నిలబడి వున్నాయ్. వాటికి అటూ యిటూ స్త్రీ పురుషులు. అంటే, ఒక స్త్రీ ఒక పురుషుడు మధ్యలో ఒక జంతువుని కౌగిలించుకుని నృత్యం చేస్తున్నారు. ఇలాగే అంతా. ఒక స్త్రీ, ఒక పురుషుడు మధ్యలో ఒక జంతువు. వాళ్లని ఒకటిగా చేస్తూ చుట్టుకుని అల్లుకున్న పెద్ద పెద్ద ఆకులు పువ్వులతో తీగలు. తలలపై మనుషులు కొమ్ములు

ధరించారు. ఒంటిని జంతు చర్మాలు కప్పుకున్నారు. పక్కపక్కన కొందరు కొమ్ము బాకా వూదుతున్నారు. మెళ్లో కట్టుకున్న దప్పులు వాయిస్తున్నారు. అంతా ఆకాశం వంక చూస్తూ చిందులేస్తున్నారు.

ఆ గుడి నిర్మాణమే అతి విచిత్రంగా వుంది. దగ్గరగా చూస్తే ఆ రెండు గదులూ గదుల్లా లేవు. ఒక పెద్ద గుహ ఒడిలో చిన్న గుహ వున్నట్లుగా వుంటుంది. కాస్త దూరం నుంచి చూస్తే, ఒక బలమైన అడవి దున్న శరీరాన్ని మినహాయించి, మెడ వరకు నేలపై ఆనిస్తే ఎలా వుంటుందో అలా వుంటుంది. నోరు తెరిచి, కొమ్ములతో మోర సారించి ఆకాశాన్ని చూస్తున్నట్లుగా వుంటుంది.

అంతా గుడి చుట్టూ దణ్ణం పెడుతూ ప్రదక్షిణలు చేశాక – పెద్దాయన యిలా అన్నాడు. “నాయనా, గుడిని కనుక్కున్నాం. ఇది మీ వల్లనే సాధ్యమైంది. యింక – యికనుంచి యిక్కడ మనం ఏం చెయ్యాలో, ఎట్లా చెయ్యాలో నాకు తెలియదు. కొన్ని సంస్కారాలుంటాయి, సంప్రదాయాలుంటాయి. వాటిని సక్రమంగా నెరవేర్చి, ప్రజల ప్రవేశానికి సన్నద్ధం చెయ్యాలి. అవి నాకు తెలీదు. అయితే, యిటువంటి అతిప్రాచీన దేవాలయాలకు సంబంధించిన విధి విధానాలు ఆచార నియమాలు క్షుణ్ణంగా తెలిసిన సిద్ధాంతి ఒకరు కోయంబత్తూరులో వున్నారు. వారికి తెలియజేస్తాను. వారిని యిక్కడికి రప్పిద్దాం. ఆయన మన కోరికను మన్నించే స్వభావం గలవారని విని వున్నాను. ఆయన వచ్చేలోపల యీ ప్రాంతాన్ని శుభ్రం చేద్దాం. ఊరి నుంచి గుడికి జనం రావడానికి దారిని ఏర్పాటు చేద్దాం. సరేనా. ఇప్పుడు యిళ్లకు వెడదాం పదండి” అన్నాడు. అంతా తలలూపారు. ఎంతో ఆనందంతో దణ్ణాలు పెడుతూ, జేజేలు పలుకుతూ కోలాహలంగా కిందికి బయల్దేరారు.

ఊరు వూరంతా గుడి గురించి గుప్పుమంది. చుట్టు పక్కల గ్రామాలన్నింట్లోకి యీ వార్త కథలు కథలుగా పాకింది. కొంత ఆలోచించగల వారి మధ్య గుడి నిర్మాణం గురించి, శూన్యత్వం పైన చర్చోపచర్చలు జరిగాయి. ఏతావాతా చాలామందిలో పెద్దాయనపై గౌరవం చాలా పెరిగింది.

ఆకాశవాణి ఆయనకు స్వప్నంలో సందేశమియ్యడం గొప్ప విశేషంగా చెప్పుకున్నారు. తద్వారా ఆయన్ని శూన్య స్వామిగా పిలుచుకోడం ప్రారంభించారు.

కొన్ని రోజుల తర్వాత కోయంబత్తూరు నుంచి షణ్ముఖానంద సిద్ధాంతి వొచ్చారు. శూన్య స్వామికంటే వయసులో పెద్దవారు. తెలుగువారే. తాత ముత్తాతలు అక్కడ స్థిరపడ్డారట. అన్ని ప్రాంతాలకూ పర్యటిస్తూ వుంటారట. భారీ శరీరం. – ప్రశాంత వదనం. నొసట ఎర్రటి చిన్నబొట్టు. మెళ్లో రుద్రాక్షలు. అందర్నీ ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తారు. శూన్య స్వామి చెప్పగా స్వప్న వృత్తాంతం, దేవాలయం గురించిన వివరాలు సావధానంగా విన్నారు. కళ్లు మూసుకుని కాసేపు నిశ్చల స్థిర స్థితిలోకి వెళ్లారు.

షణ్ముఖానంద ఓ తెల్లవారురుఝాము ముహూర్తం పెట్టి ఊరు చివర్న, అరణ్యం ప్రారంభమయ్యే చోట నేలంతా శుభ్రంచేసి, కళ్లాపుజల్లి, ముగ్గువేసి, పూజ సామగ్రితో గగనార్చనం చేసి, శూన్య స్వామితో బాటు తమవెంట రాగలిగిన వారందరితో, మొదటి బృందంగా దీక్ష స్వీకరింపజేసి, ప్రయాణం మొదలుపెట్టారు. దారిలో, కొండ ఎక్కడంలో ఆయన కొంత యిబ్బంది పడ్డారు.

కొండమీదకు చేరగానే, దేవాలయం చూడగానే ఆయనలో విద్యుత్ ప్రవహించింది. మనిషి మారిపోయాడు. ఆనందబాష్పాలతో, రెండు చేతులూ ముందుకు చాస్తూ – 'ఆకాశ దేవరా, యిక్కడ వున్నావా' అంటూ పారవశ్యంతో గుడిగోడలు తాకుతూ, హత్తుకుంటూ, కళ్లు తుడుచుకుంటూ, లోపలనే శ్లోకాలు చదువుకుంటూ, మూడుసార్లు ప్రదక్షిణలు చేసి, ముఖద్వారం వద్ద నిలబడి నమస్కరించి 'ఆవహించు ఆకాశదేవరా' అని బిగ్గరగా అంటూ మొదటి గదిలోకి వెళ్లి, ఓ మూల మఠం వేసుకుని కూచుని, కళ్ళు మూసి సమాధ్యవస్థలోకి వెళ్లిపోయారు. వెలుపల అంతా కేరింతలతో భజన చేస్తూ, ఆయనవంకే చూస్తూ, ఆయన వలెనే నేలమీద కూర్చున్నారు. కాసేపు అలా గడిచాక షణ్ముఖానంద బయటికొచ్చారు.

పరమానందం ఆయనలో అణువణువునా తొణికిసలాడింది. ముఖంలో తేజస్సు మెరుస్తోంది. అప్పుడు శూన్యస్వామి చేతులు జోడించి – “బాబూ, షణ్ముఖానందగారూ, మీరు ఎంతో దూరం నుండి మా కోసం రావడం చాలా సంతోషంగా వుంది. అది మా అదృష్టం. ఆ ఆకాశదేవరే మిమ్మల్ని మా వద్దకు పంపినట్లుగా వుంది. ఈ మార్మిక, ప్రతీకల దేవాలయం గురించి మరిన్ని వివరాలు చెప్పండి. అలాగే, యిక నుండి యిక్కడ మేం ఏం చెయ్యాలో, ఎట్లా చెయ్యాలో విధివిధానాలు దయచేసి చెప్పండి.” అన్నాడు.

ఆయన వెంటనే ఏం మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఆకాశంవంక, దేవాలయంవంక, పరిసరాలు చూస్తూ అటూ యిటూ కాసేపు అడుగులు వేశారు.

‘చెప్పండి బాబూ’ అన్నాడు శూన్యస్వామి.

‘తప్పకుండా చెబుతాను’ అంటూ ఆయన అందరివంకా గంభీరంగా చూస్తూ నెమ్మదిగా మొదలుపెట్టారు.

“నేను చెప్పబోయే విషయాల్లో కొన్ని మీకు యింతకు ముందే తెలుసు. ఆ మహామాతృశ్రీ ఆకాశ దివ్యవాణి స్వామివారి స్వప్నంలో వివరంగా చెప్పింది. నేను చేసేదేమిటంటే, వాటిని మరొక్కసారి మీకు గుర్తుచేయడమే.”

‘ఇది ప్రతీకాత్మక నాగరికతా కాలానికి చెందినటువంటిది. శూన్యపురాణ లక్షణాల ఆధారంగా నిర్మించబడినటువంటి దేవాలయం. ఆ నాగరికత కాలగర్భంలో అనేక కారణాలవల్ల కలిసిపోయింది. దానితోబాటు మన ఆలోచనా విధానంలోనే ప్రతీకల ప్రాధాన్యత మాసిపోయింది. ఇది యివాళ మన దృష్టికి వచ్చిన అరుదైన దేవాలయం. మనం నిజంగా చాలా అదృష్టవంతులం. మాయ, మిథ్య పక్కన పెట్టండి. యిందులో మనం చూసేవన్నీ ప్రతీకలే. నిజానికి మానవుడే ప్రకృతికి ఓ ప్రతీక. ‘ప్రతీక’ అర్థమైతే ప్రకృతి అర్థమవుతుంది. తద్వారా సర్వం స్పష్టంగా గోచరమవుతుంది. ఈ దేవాలయ నిర్మాణంలోని గాఢత అర్థమైతే మన మనసుని చుట్టుకుని వున్న మార్మికత మంచులా కరిగిపోతుంది. జీవన అస్తిత్వ సంఘర్షణలో ఎవరికివారు

ఏ స్థితిలో, దశలో వున్నారో స్పష్టంగా తెలుస్తుంది. దాని వలన లక్ష్యం చేరుకోడం సులువవుతుంది. నిస్సందేహంగా మన ప్రయాణానికో అర్థం ఏర్పడుతుంది. శుభం కలుగుతుంది". అని, కాసేపు ఆగి, తిరిగి చెప్పడం కొనసాగించారు.

"మీరు ముఖ్యంగా చెయ్యవలసింది కొండమీద నిశ్శబ్దం పాటించడం. దానివల్ల మన మనసుని ప్రతిక్షణం పరిపరివిధాల పక్కదారి పట్టించే ఆలోచనలు క్రమంగా అదృశ్యమవుతాయి.

తోసుకోకుండా, ఒకరి తరువాత ఒకరుగా, ముందు గదిలోకి వెళ్లి మూలన కూచోండి. అంటే, అప్పుడు మీరు ముందుగది అనే భౌతిక శూన్యంలోకి వెళ్లారన్నమాట. తరువాత వెనుక గదివైపు చూడండి. అంటే, అప్పుడు మీరు వెనుక గది అనే మహాశూన్యంవైపు చూస్తున్నారన్న మాట. రెండు శూన్యాలూ కలిసిపోయి ఒకే అద్భుత శూన్యం కావడం గురించి కళ్లు మూసుకుని కాసేపు ఆలోచించండి. ఒకటి రెండు నిమిషాలు అలా ఆలోచించి బయటకి వచ్చేయండి. ఇట్లా అప్పుడప్పుడూ చేస్తూ వుండండి. దానివలన, శూన్యత్వమనేది వున్నదని, ముందు తెలుస్తుంది. తరువాత దశలో మీ లోనిశూన్యత, క్రమంగా వెలుపలిశూన్యత మీ అనుభవంలోకి వస్తాయి. రెండు శూన్యతల కలయిక కోసం మీలో ఆలోచన మొదలవుతుంది. ఈ శూన్యత్వాల ఎరుకే మీ గురించి మీకు తెలియజేస్తుంది. ఈ అంతర్ బహిర్ శూన్యతల అనుభవం మిమ్మల్ని గాలిలో నడుస్తున్నంత తేలిక జేస్తుంది. ఇదే శూన్యయోగం. దీనితో మీ జీవితంలోని భారాలన్నీ మబ్బులవలె తొలగిపోతాయి. శుభం కలగడమంటే యిదే.

"ఇక మీరు పూజలు పునస్కారాలు, హారతులు, కొబ్బరికాయలు కొట్టడాలు, మొక్కులు మొక్కడాలు, తీర్చుకోడాలు ఏవైనా సరే అన్నీ చెయ్యవచ్చు. కాని, అవి కొండమీదకాదు, కొండకింద చేసుకోవచ్చు. కొండమీద యివన్నీ నిషిద్ధం. ఇక్కడ తప్పకుండా నిశ్శబ్దం పాటించాలి.

మహర్షులు నిశ్శబ్ద స్థలాలలోనే తపస్సు చేసుకునేవారు. అలా ఒకప్పుడు మహర్షులు నడయాడిన ప్రదేశమిది.

"మరో అతిప్రధానమైన విషయం ఒకటి మీకు చెప్పాలి. జాగ్రత్తగా వినండి. ఒక నదిపై కట్టిన బ్రిడ్జిమీద నుంచి రైలు వెడుతున్నప్పుడు, అందులో వున్న మనం ఒకటో రెండో నాణేలను నదీమతల్లి ప్రవాహ గర్భంలోకి విసిరి నమస్కరిస్తాం. అలాగే, యిక్కడ కూడా ఒకటిగాని, ఎన్నయినాగాని, నాణేలుగాని నోట్లు గాని వెనుక గదిలోకి అంటే మహాశూన్య గర్భంలోకి విసిరి, నమస్కరించి బయటకు రావొచ్చు. అక్కడ ప్రవహించే నదీమతల్లి, యిక్కడ అనంతాకాశ శూన్యత్వమూ సమానార్ధకాలు. ఇలా నాణేలుగాని, నోట్లుగాని మహాశూన్యానికి సమర్పించడం తప్పని సరి కాదు. ఇది పూర్తిగా మానసిక తృప్తికోసం చేసే పని మాత్రమే." అని చెప్పి, కాసేపు అందరివంకా చూసి – "ఇంక విశిష్ట విధానం మొదలు పెడదామా" – అంటూ మొదట శూన్య స్వామిని ఆహ్వానించారు. మొదటి గదిలోకి వెళ్లి, శూన్య యోగం ఆచరించమని కోరారు. ఆ తరువాత మరి కొందరిని, ఒకరొకరిగా లోపలికి పంపి, వారు చేస్తున్న పద్ధతిలో తేడా వుంటే సరిదిద్దారు. అలా చాలాసేపు జరిగింది. చివరి మనిషి గదిలోంచి బయటికొచ్చాక – "ఇంక, యీ కార్యక్రమాన్ని యివాల్టికి ఆపుదాం. కిందికి వెడదాం పదండి. రేపు ద్వితీయ విఘ్నం జరక్కుండా ఎంతమందితోనైనా సరే కొనసాగించండి. దానివల్ల వ్యక్తిగతంగానే కాకుండా మొత్తం గ్రామానికి శుభం చేకూరుతుంది" అన్నారు షణ్ముఖానంద.

రెండ్రోజుల తర్వాత, తానింక కోయంబత్తూరు వెళతానని ప్రకటించారు షణ్ముఖానంద. దానిపై శూన్యస్వామి, వూరి పెద్దలు సంప్రదించుకున్నారు. ఆయనను మరికొంత కాలం అక్కడే వుండమని కోరదామనుకున్నారు.

శూన్యస్వామి షణ్ముఖానందతో –

"బాబుగారూ, మీరు మాకు మార్గదర్శకులు. ఇంత దూరం వొచ్చి మాకెన్నో విషయాలు బోధించారు. మరి కొంతకాలం మీరిక్కడే వుండి మేం

సరియైన పద్ధతిలో శూన్యయోగం ఆచరించేట్లు తీర్చిదిద్దండి. దేవాలయాన్ని వుద్ధరించడానికి యింకా మేం ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి. మీరిక్కడ వుండడానికి చెయ్యవలసిన ఏర్పాట్ల గురించి చెప్పండి. చేస్తాం. అలాగే, మీకు కావలసినంత మంది సహాయకులను వేసుకోండి, మమ్మల్ని ప్రారంభంలోనే వదిలి వెళ్లకండి. మీరు వెళ్లిపోతే మాలో శూన్యయోగంపై ఆసక్తి తగ్గిపోతుంది. క్రమంగా ఆ దేవాలయం గొప్పదనం మరుగున పడిపోతుంది. దయచేసి మీ ప్రత్యేక సహాయం కొనసాగించండి. ఇదే మా ప్రార్థన" అని అయన చేతులు పట్టుకున్నాడు. ఊరి పెద్దలు కూడా – 'అయ్యా, వుండండయ్యా' అంటూ బతిమిలాడారు. షణ్ముఖానంద కాసేపు ఆలోచనలో పడి, 'సరే, మీ యిష్టం ప్రకారమే కానివ్వండి' అన్నారు.

షణ్ముఖానంద ఆధ్వర్యంలో చాలా అభివృద్ధి పనులు జరిగాయి. ముందుగా పదిమంది యువకులను సహాయకులుగా వేసుకున్నారు.

కొండమీద నిశ్శబ్దం పాటించడం, జనాన్ని క్యూలో నిలబెట్టడం, తోపులాటలు లేకుండా చెయ్యడం, తాగినవాళ్లని కొండమీదకు రాకుండా చూడడం, జేబుదొంగతనాలు, యితరత్రా అల్లరి చిల్లర జులాయి పనులు, గొడవలు లేకుండా చూడడం యీ మొదలైన పనుల్లో శిక్షణ పొందిన సెక్యూరిటీ గార్డ్స్‌వలె యీ పదిమంది చేసే పనులు.

షణ్ముఖానంద దాదాపుగా రోజంతా పర్యవేక్షిస్తూ కొండమీదే వుండేవారు. ఎప్పుడన్నా కొండ దిగినప్పుడు చుట్టు పక్కల గ్రామాల్లో, గూడేలలో ఏర్పాటు చేసే సభల్లో శూన్యతత్వం గురించి, తద్వారా జీవితం తేలిక పడడం గురించి, ఆకాశదేవర మహాత్యాల గురించి ఉపన్యాసాలిచ్చేవారు. ఆయన ఉపన్యాస ధోరణిలో జనాకర్షణ వుంది.

షణ్ముఖానంద యింకా ఆవూరికి రాని రోజుల్లో ఆ కొండని దేవరకొండగా, శూన్యం కొండగా, గుడిని శూన్యం గుడిగా, ఆకాశ ఆలయంగా, దేవర దేవళంగా, యిలా జనం రకరకాలుగా పిలుచుకునేవారు. షణ్ముఖానంద వచ్చిన తర్వాత, ఆయన చెప్పిన విషయాలు ఎవరికి ఎంత

అర్థమైనంతగా కోనల్లోకీ, గూడేల్లోకీ, చుట్టుపక్కల వూళ్లలోకీ అనోటా ఆనోటా ప్రయాణించి చివరికి తమ కోర్కెలు తీర్చే 'ఆకాశదేవర'గా స్థిరపడింది.

మొదట్లో పాదం మోపే దారిలేని ఆ భీకరారణ్యంలో కాలిబాట ఏర్పడింది. అది పెరిగి, రెండెడ్ల బళ్లు నడిచాయి. మరింత పెరిగి, యితరత్రా వాహనాలేగాక జీపులు నడుస్తున్నాయి. ఆకాశదేవర విశేషం ఎంతగా వ్యాపించిందంటే ఓ రోజున ఆ నియోజకవర్గం ఎం.పి (పార్లమెంటు సభ్యులు) తన మందీ మార్బలంతో అట్టహాసంగా వొచ్చారు. కొంత ప్రయాసపడుతూనే కొండెక్కారు. షణ్ముఖానంద పూలదండ వేసి గుడి దగ్గరకు ఆహ్వానించారు. గుడి మహాత్యం గురించి చెప్పారు. వారు సూచించిన ప్రకారం మూడుసార్లు ప్రదక్షిణ చేశారు ఎం.పి గారు. తర్వాత మొదటి శూన్యం గదిలోకెళ్లి రెండు నిమిషాలు కళ్లు మూసుకుని కూర్చుని శూన్య యోగం ఆచరించారు. కళ్లు తెరిచి ఒక నోట్ల కట్ట మహాశూన్యం గదిలోకి విసిరి దణ్ణం పెట్టుకుంటూ బయటకు వొచ్చారు. అక్కడనే కాసేపు దేవాలయం ప్రాముఖ్యతపై వివరాలు తెలుసుకుంటూ గడిపారు. అందరినీ వుద్దేశిస్తూ, షణ్ముఖానందగారిని మెచ్చుకుంటూ తన నియోజకవర్గంలో యింతటి గొప్ప ప్రాచీన దేవాలయం వెలికిరావడం తనకెంతో ఆనందంగా వుందని, యిది తన ప్రజల అదృష్టమని చెప్పారు. అంతటితో ఆగకుండా – 'ఈ దేవాలయం అభివృద్ధికి ఏం కావాలో నిస్సందేహంగా అడగండి. నావైపు నుండి చెయ్యగలిగినదంతా తప్పకుండా చేస్తాను' అని చప్పట్ల మధ్య హామీ యిచ్చి వెళ్లారు.

ఎం.పి. గారు వచ్చి వెళ్లిన తర్వాత కొందరు ఎం.ఎల్.ఎలు, దూర ప్రాంతాల నుండి ప్రముఖులు వచ్చారు. వీళ్ల రాకతో జనాల రాక కూడా బాగా పెరిగింది. మహాశూన్యం గదిలోకి నాణేలు, నోట్ల వర్షం కురవసాగింది. ప్రైవేటు బస్సు పడింది. దానితో కాలినడకన, సైకిళ్లమీద, రిక్షాలు, ఆటోల మీద వచ్చేవాళ్లుగాక బస్సులో దూరప్రాంత జనాలు తండోపతండాలుగా రావడం జరుగుతోంది. కొండ దిగువన టెంకాయలు కొట్టడం, పసుపు కుంకుమలు, పళ్లు పూలు, పూజలు, హారతులు, జాతర్లు, పూనకాలు, ఒక్క

బలులు తప్ప అన్నీ ధూంధాంగా జరుగుతున్నాయి. క్రమంగా దారి పక్కన అటూ యిటూ చిన్నపాటి షాపులు వెలిశాయి. వారానికోసారి సంత జరుగుతోంది. కొండదిగువన జరిగే పూజలు, దానికి సంబంధించిన కార్యక్రమాలన్నీ శూన్యస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

● ● ●

మిస్టర్ కారష్ కుతూహలంగా ఆర్యాలజిస్టు ఈశ్వరశర్మ రాసిన 'ఆకాశదేవర' పుస్తకం చదవడం అయింది.

మనసులో ఎన్నో ఆలోచనలు కందిరీగల్లా కదిలాయి. సత్యానంద్‌ని పిలిస్తే బావుంటుంది' అనుకున్నాడు.

పర్సనల్ మొబైల్‌లో – 'సత్యానంద్, వెంటనే నా ఆఫీసుకి రాగలవా' అన్నాడు కారష్.

'వస్తాను. సరే నీ ముందు గ్లాస్ వుందా' అని అడిగాడు సత్యానంద్.

'ఉంది'.

'అందులో ఏం వుంది'

'రాయల్ శాల్యూట్ విస్కీలో రెడ్ గ్రేప్స్. ఎర్రద్రాక్షపండు. నీకేం యిబ్బంది వుండదులే, వచ్చెయ్' అన్నాడు కారష్.

సత్యానంద్ అలా అడగడానికి, గ్లాస్ గురించి ప్రస్తావించడానికి కారణం వుంది. కారష్ అలవాట్లు, యిష్టా యిష్టాలు, మూడ్స్ అతనికి తెలుసు.

కోసిన మంచుముక్కలా, తీవిగా వుండే దళసరి గాజు గ్లాసులంటే కారష్‌కి యిష్టం. పొడుగాటి కర్కశ దంతాలతో మెరిసే ఫోర్కులంటే యిష్టం. తళతళలాడే కత్తులంటే యిష్టం.

**దృశ్యం ఒకటి:**

ఐదు నక్షత్రాల (నఖక్షతాల) గదిలో గాజు గ్లాసులోని రాయల్ శాల్యూట్ విస్కీలో ఒక ఎర్రటి గులాబి మొగ్గ యీదుతుండగా తాగడం అతనికిష్టం. తాగడం అవగానే, చివరి బిందువులు తొందరపడుతుండగా, అప్పటివరకు విస్కీలో తడిసి ముద్దయి మనోహరంగా ముడుచుకున్న ఎర్రగులాబి మొగ్గను

తనివితీరా తినేస్తాడు. తినగానే గది తలుపులు కొత్త తలపులవలె నిశ్శబ్దంగా తెరుచుకుంటాయి. ఓ వెన్నెల పుష్పం యవ్వన పరిమళం చిమ్ముకుంటూ ప్రవేశిస్తుంది. వెంట వచ్చిన వసంత రుతువుతో గదినంతా అదుముకుంటూ వ్యాపిస్తుంది. పగబట్టిన పరుపు బిగియారా రణస్థలిగా మారుతుంది. మిథునం ఆధునిక అశ్వమేధంలో, మృగయా వినోద కేళితో స్వర్గారోహణం ముగియగానే లోకోత్తర లావణ్యం తిరిగి నాజూగ్గా చీర కట్టుకుని, చిరునవ్వుల హొయలు వెరజల్లి కనుమొనలతో వీడ్కోలు ముచ్చటగా తీసుకుని వెళిపోతుంది.

ఈ అద్వైత క్రీడ ప్రతిరోజూ జరుగుతుందని కాదు, అలాగని జరగదనీ కాదు. అతని మానసిక వాతావరణాన్ని బట్టి జరుగుతుంది. అయితే, ఏ రోజున - రెండు వర్గాల మధ్యనో, రెండు రాజకీయ పార్టీల మధ్యనో, రెండు కంపెనీల మధ్యనో, యిద్దరు ఖరీదైన నేతల మధ్యనో, కారష్ జోక్యంతో లాభదాయకంగా రాయబారం ముగిసినప్పుడు, కోట్లు, లేక ఆస్తులు మొదలైనవి చేతులు మారినప్పుడు, పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలను మింగేసినప్పుడు - ఆ రాత్రి తప్పకుండా ఘల్లుఘల్లుమనే గాజుగ్లాసులో మరోసారి మరో తాజా ఎర్ర గులాబీ మొగ్గ తేలియాడుతుంది.

**దృశ్యం రెండు:**

విస్కీ గ్లాసులో ఆవిరిలో వండిన చికెన్ ముక్క వుంటుంది. చిన్న ముక్క ఆ రోజున ఎవర్నో నిర్దాక్షిణ్యంగా ఖతం చేయించాడన్నమాట. అవతలివాడు చికెన్ అయ్యాడన్నమాట. ఆవిరిలో కలిసిపోయాడన్నమాట.

**దృశ్యం మూడు:**

గ్లాసులో గులాబి మొగ్గ, చికెన్ ముక్క లేనప్పుడు రెడ్ గ్రేప్ వుంటుంది. అంటే, అప్పుడతను ఖుషీగా కబుర్లు చెప్పే మూడ్‌లో వున్నాడన్నమాట. అటువంటి సమయాల్లోనే సత్యానంద్‌ని పిలుస్తూ వుంటాడు.

ఇతరులకు లోతైన మనిషి, మితభాషి. తాను ఎవరికీ అర్థంకాని, అర్థంకానివ్వని వ్యక్తి - మిస్టర్ కారష్.

● ● ●

సత్యానంద్ వొచ్చాడు.

వస్తూనే - 'ఏమిటి విశేషం, రమ్మన్నావ్' అన్నాడు.

విశేషం చెబుతా గానీ, ముందు కంఫర్టబుల్‌గా కూచో. లిక్కర్ ఎలాగూ ముట్టుకోవు. జన్మలో సిగరెట్ లేదు, పాన్ లేదు, మత్తెక్కించే దేన్నీ ఒళ్లోకి రానివ్వవ్. నీతో చాలా యిబ్బందిరా, డియర్ రాస్కెల్. సరే. నీ కోసం మార్కెట్లో దొరికే ఛాయిసెస్ట్ ఫ్రూట్స్‌తో యీ జ్యూస్ చేయించా, తీస్కో'. అని జ్యూస్ మగ్ అందించాడు.

మగ్ అందుకుంటుండగా, అప్రయత్నంగా సత్యానంద్ దృష్టి ఎదురుగా టేబుల్‌పై వున్న 'అకాశ దేవర' పుస్తకంపై పడింది. మగ్ పక్కన పెట్టి, పుస్తకం తీసుకుని పేజీలు తిప్పుతూ - 'చాలా ఆశ్చర్యంగా వుందే... నీ దగ్గర 'అకాశదేవర' పుస్తకం వుండడం.... నమ్మలేకపోతున్నా... పోనీలే, యిన్నాళ్లకయినా దైవ భావనలోకొచ్చావ్, సంతోషం....' అన్నాడు ఆనందం, ఆశ్చర్యం కలగలిసిన భావంతో.

కారష్ నవ్వుతూ - 'అదేం లేదులే. మరీ అంత సంతోషపడకు. నేను డబ్బున్న వాణ్ణిగదా, చాలామంది ఏదేదో ఆశిస్తూ నాదగ్గరకొస్తుంటార్లే. ఈశ్వర శర్మట. ఈ పుస్తకం యిచ్చి వెళ్లాడు. ఇంతకీ నువ్వీ పుస్తకం చదివావా'

దీన్ని చదవలేదు. ఇంతకుముందు 'అకాశదేవర'పై రెండు పుస్తకాలొచ్చాయ్. గుడిదగ్గర అమ్ముతుంటే, కొని చదివా'.

'గుడి దగ్గర - అంటే, కొండమీదనా, కిందనా'

'కిందే'

'మరి, కొండమీద గుడికెళ్లావా'

'వెళ్లాను'.

'బాగుందా' అంటూ, విస్కీ సిప్ చేస్తూ యాధాలాపంగా అడిగాడు.

సత్యానంద్ వెంటనే, కొంచెం సీరియస్‌గానే -

'దేవాలయమేంటి, బాగుండడమేంటి, యిదేమీ సినిమా కాదు. 'అకాశదేవర' దర్శనం అద్వితీయ అధ్యాత్మికానుభవం. అదొక నూత్న ప్రతీక

తత్వంతో నిండిన అద్భుతం'. కాసేపు కళ్లు మూసి, తెరిచి, జ్యూస్ తాగి, తిరిగి కొనసాగించాడు.

కారష్ చిరునవ్వుతో అతనివంకే చూస్తూ, యింకా ఏమి చెబుతాడా అన్నట్లు వింటున్నాడు.

'కారష్, సరే, ఎలాగూ అనుభవం అనే విషయం ప్రస్తావన కొచ్చింది కాబట్టి, నీకో సంగతి చెప్పాలి. అడ్డం రాకుండా జాగ్రత్తగా విను.

'పెళ్లి చేసుకోవడంవల్ల సంసార బంధంలోని ఆనందం ఏమిటో తెలుస్తుంది. ఆధ్యాత్మికం వల్ల అతీతానుభవం కలుగుతుంది. నా బాధ ఏమిటంటే - యీ రెండూ కాకుండా నువ్వేటు వెళ్తున్నావో తెలీడం లేదు. కనీసం యిప్పుడన్నా చెప్పు, ఎప్పుడు పెళ్లి చేసుకుంటావో చెప్పు. అమ్మ లేదు, నాన్నలేడు, అక్కా చెల్లీ, అన్నా తమ్ముడు ఎవరూ లేరు. ఆంజాటం లేదు. ఏమిటయ్యా యింకా అడ్డంకి. వయసు వేగంగా వెళ్లిపోతోంది. ఇంకా ఎప్పుడు చేసుకుంటావ్. చేతికి ఆసరాగా కర్ర వొచ్చాక చేసుకుంటావా. ఎప్పుడడిగినా, అటూ యిటూ కాకుండా ఏదో చెప్పి అసలు విషయం దాట వేస్తుంటావ్. ఎన్నాళ్లీ హోటళ్ల బతుకు. ఎప్పుడు ఓ యింటివాడవవుతావో చెప్పు' అన్నాడు అనునయంగా సత్యానంద్.

ఫెళఫెళా నవ్వాడు కారష్. అసలు అతను నవ్వుతాడని ఎవరికీ తెలీదు. ఎందుకంటే, అతను నవ్వగా ఎవరూ చూడలేదు. ఎప్పుడూ సీరియస్‌గా వుంటాడు. సత్యానంద్ దగ్గరే నవ్వడమో, కోపం తెచ్చుకోడమో, సీరియస్ అవడమో, కన్ఫెస్ చెయ్యడమో, ఆర్గ్యుమెంట్లోకి దిగడమో, అతని దగ్గరే యివన్నీ. ఒక్కమాటలో అతని దగ్గర మాత్రమే సహజంగా వుంటాడు.

నవ్వి నవ్వి, నాలికతో ఎర్రపండును బుగ్గలోకి తోసి, మరోసారి సిప్ చేసి -

సత్యా, నేను అర్జెంటుగా పెళ్లి చేసుకోవాలంటున్నావ్. లేకపోతే, ఏదో ప్రళయం ముంచుకొస్తున్నట్లు మాట్లాడుతున్నావ్. ఓ సత్యం, బుజ్జీ, నాయనా, నే చెప్పేది కూడా కాస్త విను. ఈ కుహనా నీతి సూత్రాలకు కాపలా కాసే

నీకూ, నీలాంటి వాళ్ళకీ పెళ్లిళ్లు కావాలి. ప్రభుత్వం కావాలి. సమాజం కావాలి. ఇంకా చాలా చాలా రక్షణలు కావాలి. రక్షణలు లేందే మీరు బతక లేరు. 'రక్షణలు అవసరం' అనే భావనే అవమానకరమైనదని మీరు అనుకోరు. రక్షణ అవసరం లేని సమాజ నిర్మాణం అవసరమనే ఆలోచనే మీ వూహాల్లో కూడా వుండదు. ఇప్పుడున్నవన్నీ అసలైనవి కాదు. ఇవన్నీ నకిలీలు. ఈ నకిలీ వ్యవస్థల్ని బద్దలు కొట్టాలనే భావం మీకు రాదు. రక్షణల కోసం వెంపర్లాడే వాళ్లు పుట్టు వికలాంగులు. జీవితాంతం బిచ్చగాళ్లు. 'రక్షణలు' అనగానే మీకు సిగ్గు వెయ్యదు. పైగా రక్షణల కోసం కొత్త కొత్త ఉద్యమాలు తీస్తారు. ఇదంతా ఎందువల్లనంటే, రక్షణల బతుక్కి బానిస బతుక్కి మీరు అలవాటు పడ్డారు.

'ఒక్కసారి సీరియస్‌గా, మనం ఏ వ్యవస్థల్లో ఎలా ఎంత అసహజంగా వున్నామో ఆలోచించు. పెళ్లి పెళ్లి అంటున్నావు. ఇప్పుడు జరుగుతున్న పెళ్లిళ్లన్నీ హృదయాలకు జరుగుతున్న పెళ్లిళ్లా, లేక శరీరాలకు జరుగుతున్న పెళ్లిళ్లా.

'హృదయం, శరీరం అనేప్పటికి నేనేదో కవితాత్మకంగా మాట్లాడుతున్నట్లు నీ కనిపించవచ్చు. సరే, యీ డబ్బుపిచ్చి లోకంలో ప్రాక్టికల్‌గా ఏం జరుగుతున్నదో చెబుతా, విను. ఇవాళ సామాన్యుడు అప్పులు చెయ్యకుండా, శ్రమదోపిడీకి అమ్ముడు పోకుండా, సంతోషంగా పెళ్లి చేసుకోగలడా. పెళ్లాన్ని కులాసాగా పోషించే స్తోమతు కలిగి వున్నాడా. ఇద్దరూ చెమటోడ్చి కూలీనాలీ చేసుకుని యీ రకరకాల దోపిడీల లోకంలో సుఖంగా బతగ్గలిగే పరిస్థితి వుందా. ఇది కింది వర్గం సంగతి. ఇక, దానిపై వర్గం, అంటే మధ్య తరగతిని చూస్తే - వాళ్లు చదివే చదువులకి అర్థం పర్థం వుందా. ఆ చదివే చదువులు మానసిక తృప్తిని, జీవనానందాన్ని యిస్తున్నాయా కనీసం ఉద్యోగం దొరుకుతుందనే గ్యారంటీ వుందా, వుంటే మొగుడూ పెళ్లాం యిద్దరికీ వుద్యోగాలు దొరికితే, వాళ్లు అక్కడొకరు, యిక్కడొకరు కాకుండా, ప్రవాస జీవులు కాకుండా, యిద్దరూ ఒకే వూళ్లో పని చేసేట్టుగా

వుంటే, తమకంతో ప్రేమించుకోడానికీ, సంతృప్తితో కాపరం చెయ్యడానికీ సమయం వుందా. కనీసం - హడావుడిలో పుట్టే పిల్లల్ని తనివితీరా, వారి సహజ స్పందనలకు అనుగుణంగా పెంచే వాతావరణం వుందా!!'.

సత్యానంద్ ఓపిగ్గానే వింటున్నాడు. మధ్యలో కారష్ చెప్పే ప్రతిదానికి సమాధానం చెప్పాలనుకుంటున్నా, సరే - పూర్తిగా చెప్పనీ, అని తమాయించుకుంటున్నాడు.

అడ్డు రాబోకు అన్నట్లు చేత్తో సంజ్ఞ చేసి, తిరిగి మొదలు పెట్టాడు కారష్.

'సత్యా, సమయం వొచ్చింది కాబట్టి నీ గురించి కూడా చెప్పాలి. మొదట్నుంచీ నీతికి, నిజాయితీకి, నిబద్ధతకి వుదాహరణగా చెప్పుకోదగ్గ ప్రభుత్వోద్యోగివి నువ్వు. పెద్ద హెూదాలో వున్న కరప్ట్ కాని వుద్యోగివి. ఏ మాటకామాటే చెప్పుకోవాలి - చదువులో నాకంటే బాగా చదువుకున్నోడివి. ప్రతి క్లాసులో ఫస్ట్ రాంకర్‌వి నువ్వే. మార్కుల్లోనే కాదు, జీవితంలో ఒరిజినల్‌గా ఆలోచించగల శక్తి, దాన్ని ఆచరణలో పెట్టగల సమర్థత వున్నవాడివి. మరి, నువ్వు కొలిచే యీ ప్రభుత్వం నిన్నెలా వుపయోగించుకుంటోంది. ఏ రాజకీయ పీనుగో నువ్వు తన పనికి అడ్డంగా వున్నావనుకుంటే చాలు, ఫుట్‌బాల్‌లా ఆశాఖకీ యీశాఖకీ అడ్డదిడ్డంగా బదిలీలు చేస్తూ వుంటే, తలవొంచుకుని యస్సార్ అంటూ పని చేసుకు పోతున్నావ్. అవినీతి అంటని కడిగిన ముత్యానివి నువ్వు. నీలాంటి వాళ్లు అసలు లేరని కాదు, అక్కడక్కడా వున్నారు. కాని, మీరు అల్పసంఖ్యాకులు.

'మిమ్మల్ని కాదు, మీ సమర్థతని ప్రజా సేవకు వుపయోగించుకోని యీ ప్రభుత్వాన్ని అనుకోవాలి. అయినా, యిది ప్రభుత్వమేనా, ప్రజల కష్టసుఖాలు యీషణ్మాత్రం పట్టని దీన్ని ప్రభుత్వమని పిలవ్వొచ్చునా. నా దృష్టిలో యిది ప్రజాస్వామ్యం ముసుగు వేసుకున్న అరాచకం. ఈ భయంకరమైన అరాచకం పెట్టుకున్న పేరే ప్రభుత్వం.

ఎవడులబడితే వాడు ఎన్నికల్లో నిలబడవచ్చు. అరాచకం యిక్కణ్నుంచే

ప్రారంభమవుతుంది. ఎక్కువ భాగం - ఓటర్లను కొనగల సత్తా వున్న వాళ్లు గెలుస్తారు. చెబుతున్నా విను. డబ్బుతో కొన్న ప్రతి ఓటూ ఒక పౌర హత్యతో సమానం. రక్తం కనబడదు. మనిషిలోని నీతి హత్య చేయబడుతుంది. ఇది మొదటి రంగంలో జరిగే కసాయి కార్యక్రమం. ఈ రాజకీయ విపణివీధిలో రెండో రంగం నోరు తెరుస్తుంది. బల నిరూపణ కోసం అవసర సంఖ్య మేరకు ప్రజాప్రతినిధులనబడే వాళ్లని ప్రమాణ స్వీకరణ తర్వాత కొనెయ్యడం జరుగుతుంది. ఆ విధంగా అధికారంలో కొచ్చిన వాళ్లు అన్ని విలువలూ నిలువెత్తున పాతరేసి తామే ప్రజా అధికార పాలకులమని నిస్సిగ్గుగా ప్రకటన చేస్తారు. మూడోరంగం పరిపాలనా రంగంలోకొద్దాం. వీళ్లకి పరిపాలనపై అవగాహన లేదు. నేర్చుకుందామనీ లేదు, అందుకని, అన్నీ ఆఫీసర్లకి వొదిలేసి, వాళ్లనీ కరప్ట్ చేసి, ఎన్నికల్లో పెట్టిన ఖర్చుకి పదింతలు అవురావున రాబట్టడానికి ఎన్ని ఘోరాలైనా చెయ్యడానికి సిద్ధపడతారు. దీంతో పాలనారంగంలో గందరగోళం, అరాచకం, బీభత్సం ఏర్పడతాయ్. ఇటువంటి వాళ్లు ప్రజలకు రక్షణ యివ్వగలరా, బతుక్కి భరోసా యివ్వగలరా, అసలు ప్రజలను వాళ్ల మానాన వాళ్లని బతకనివ్వగలరా.

'సత్యా, మన సమాజం గురించి కూడా కొంత చెప్పాలి. సమాజమని పిలవబడే యీ గుంపు ఓ విచిత్రమైన పదార్థం. ఇది ప్రజాస్వామ్య కసాయి వెంట నడిచే గొర్రె. హామీలు, వాగ్దానాలు, పథకాలు, ప్రాజెక్టులు యిటువంటి మాటలు చాలా వున్నాయి. సంక్షేమం పేరుతో కసాయికో భాష వుంది. అదో స్మశాన భాష. గొర్రె గుంపు ఆ భాషని నమ్ముతూనే వుంటుంది. నకిలీ నాయకులపై తిరగబడని గొర్రెలకు ఎన్ని ఉద్యమాల కొమ్ములున్నా అవి అలంకరణకు తప్ప దేనికీ పనికిరావు. అవునా, కాదా సత్యా" అన్నాడు కారష్.

ఇంతసేపు ఓపిక పాటించిన సత్యానంద్, యింక లాభం లేదని మౌనాన్ని బద్దలు కొట్టాడు.

"యిక్కడితో, నీ ఉపన్యాస ధోరణి కాస్సేపు ఆపు కారష్', అన్నాడు.

"నీకు ప్రజలమీద ప్రేమ, ప్రభుత్వమంటే కసి వున్నాయని నాకు తెలుసు. అయితే యివాళ మనం యీ విషయాలమీద మాట్లాడుకోబోతున్నామని నేననుకోలేదు.

రమ్మన్నావ్. విశేషం వుందన్నావ్. నీ పెళ్లి గురించే అయి వుంటుందనుకున్నా. ఇంతకు ముందు చెప్పిన విషయాలే మళ్లీ మళ్లీ చెబుతున్నావ్. నేనవన్నీ కాదనను. అయితే, యిప్పుడు కాదు, వాటి మీద మరోసారి మాట్లాడుకుందాం. మనదేశంలో, నువ్వు చెబుతున్న పరిస్థితులు రావడానికి ఎన్నో కారణాలున్నయ్. వాటి మీద నీకు కొన్ని అభిప్రాయాలున్నయ్, అలాగే,. నాకూ వున్నయ్. తప్పకుండా వాటి మీద మాట్లాడుకుందాం. యిప్పుడు కాదు, మరోసారి. మళ్లీ దాటవెయ్యకుండా, ముందు నీ పెళ్లి గురించి చెప్పు, సంతోషిస్తా" అన్నాడు సత్యానంద్.

దానికి కారక్ష్ -

"అవే విషయాలు మళ్లీ మళ్లీ చెబుతున్నానంటున్నావ్. దాటవేస్తున్నానంటున్నావ్. దానర్థం నీకివేమీ ఎక్కడం లేదన్నమాట. యివన్నీ అసంగతంగా వున్నాయన్నమాట. అన్నీ పక్కనబెట్టి, ముందు నా పెళ్లి గురించి చెప్పవయ్యా అంటున్నావ్. నిజమే, యిప్పుడు నాకు వెనకాముందూ ఎవరూ లేరు, నువ్వు తప్ప. నా గార్డియన్ పొజిషన్‌లో నిన్ను ఏర్పాటు చేసుకున్నావ్, సంతోషం, అదీ కాదనను. అయితే, నా హితుడివి కాబట్టి, నువ్వు చెప్పే విషయాలకు ముందు, నే చెప్పే కాసిని మాటలు నువ్వు వినకతప్పదు.

'మనం కలిసినప్పుడల్లా, మరీ ముఖ్యంగా యిటీవల - నన్ను ఓ యింటి వాడిని చేసెయ్యాలనే తాపత్రయంతో యీ పెళ్లి ప్రస్తావన తీసుకొస్తున్నావ్. దాని మీద కూడా నేను చాలాసార్లు నా వైఖరి చెప్పా. నువ్వు మాత్రం అర్థం చేసుకోడం లేదు. నీదంతా వన్‌వే ట్రాఫిక్ ఆలోచన. బహుశా, నేనే యిన్‌డైరెక్ట్‌గా చెబుతున్నందువల్ల కాబోలు నా ట్రాక్‌లోకి రావడంలేదు. ఇప్పుడు సూటిగా చెబుతా, విను. నేను చెప్పే అంశాలు నీకు

ఎంతవరకు అర్థమవుతాయో నాకు తెలీదు, అయినా విను. వినడం ఒక కళ. అర్థం చేసుకోవడం, గొప్ప సాధనకు చెందిన ఫలితాంశం. నేను నీకు మిత్రుణ్ణనేది పక్కన బెట్టి విను. మన పూర్వ పరిచయాన్ని వొదిలేసి విను. కొత్త మనిషి చెబుతున్నట్టు విను. నేనేకాదు, ఎవరు ఏం చెబుతున్నా, అది మొదటిసారి వింటున్నట్టు విను, అలాగే ఏ పుస్తకం చదువుతున్నా మొదటిసారి చదువుతున్నట్టు చదువు, ఎన్నో కొత్త అర్థాలు మనలో పురివిప్పుతాయి.

నేనిప్పుడు చెప్పేవి నీకు పాతవిగా అనిపించవచ్చు. కొత్తవే అయినా, కొత్తవిగా తీసుకోడానికి నీకు మనస్కరించకపోవచ్చు. అయినా అసహనం కాస్త పక్కన బెట్టి, విను.

నేను ఆదర్శ జీవిగా వున్న రోజుల్లో - నేను ప్రేమించిన, నన్ను ప్రేమించిన అమ్మాయినేపెళ్ళి చేసుకుందామనుకున్నా. క్రమేణా అన్నిట్లాగే ప్రేమ కూడా కాలుష్యం బారిన పడింది. ఇవాళ హృదయంలోంచి హృదయంలోకి పొంగుకొచ్చే ప్రేమ లేదు. డబ్బునో, కీర్తినో, యివ్వగల రక్షణనో, అవసరాన్నో దేన్నో ఆశించి చేసే మానసిక, శారీరక ఎక్సర్‌సైజ్ తప్ప ప్రేమ అనేది లేదు. వస్తు వ్యామోహ సంస్కృతిలో కొట్టుకుపోయి ప్రేమ కూడా ఒకానొక వస్తువైపోయింది. ప్రేమ కూడా అనేకపేర్లతో, అంటే బ్రాండ్ నేమ్స్‌తో, మార్కెట్లో దొరుకుతుంది. రోడ్డు పక్క నేలబారు పచారీ షాపులోనో, ఫైవ్‌స్టార్ వంటి మాల్‌లోనో, బిగ్ బజార్లోనో ఎంత కావాలో అంత, ఎంత ధర పెట్ట గలిగితే అంత ప్రేమ దొరుకుతుంది.

నేను సౌందర్యాన్ని మోహిస్తాను, కామిస్తాను. కావాలనుకున్నప్పుడు సౌందర్యాన్ని తనివితీరా పొందుతాను. ఇదే కాదు, శారీరక, మానసిక, భౌతిక, అభౌతిక, మొదలైనవన్నీ, ద్రవానుభవాలన్నింటినీ డబ్బుతో కొనవచ్చు. మరోసారి చెబుతున్నా. యివాళ ప్రేమ అనేది లేదు. ప్రేమకు తనదైన వునికి లేదు. స్వయంగా ప్రేమ బతకలేదు. దాని స్థానంలో 'ప్రేమ' అనే భావన వుంది. 'ప్రేమ' అనే వాదం వుంది. అదొక జాలం. ఆ భావం, వాదం, తర్కం, జాలంలోంచి బయటపడలేరు. ఎందుకంటే - మనిషి ఆభాసలో

బతుకుతున్నాడు. తనకు కావలసినవన్నీ తనకెదురుగానే వుంటాయి. కాని, అవి అభాస ప్రాంగణంలోనే వున్నాయి. మనిషి కూడా. అభాస వలయంలోనే తాను వున్నాననే విషయం కూడా మనిషికి తెలీదు. అది తెలిసినప్పుడు, జ్ఞానేంద్రియాల ఆవరణ కూడా దాటి నిజమైన ప్రేమ జన్మించే ప్రదేశంలోకి ప్రవేశిస్తారు – స్త్రీ పురుషులు".

కాసేపు ఆగి, తిరిగి గ్లాస్ అందుకున్నాడు కారష్.

కారష్ తుఫాన్ ధోరణి కాస్త ఆగగానే యిదే అదను అని సత్యానంద్ అందుకున్నాడు.

'కారష్, నువ్వు మాట్లాడే మాటలు నగరాలు మాట్లాడే మాటలు. సోకాల్డ్ నాగరీకులు మాట్లాడే మాటలు. కాని, సహజంగా బతికే మనుషులున్న గ్రామాలు యింకా వున్నాయ్. నువ్వు చెప్పే విషయాలు పూర్తిగా తీసెయ్యలేను, అందులో కొంత నిజం వున్నమాట నిజమే. పూర్తిగా మాత్రం కాదు. ప్రస్తుతం నేనడిగేదీ, నువ్వు చెప్పేదీ - సమయం వేరు, సందర్భం వేరు.

నీ పెళ్లి గురించి అడిగితే, ప్రేమ కలుషితమై పోయిందన్నావ్. ప్రకృతి నుంచి విడిపోయిన మనుషులు సంచరించే ప్రదేశాల్లో కాలుష్యం పెరిగిందనడంలో సందేహం లేదు. కానీ, యింకా పూర్తిగా కాలుష్యం ఆక్రమించలేదు, వ్యాపించలేదు, మనుషుల్లో స్పందించే నిర్మలమైన హృదయం వుంది. ప్రతిధ్వనించే మనసు వుంది. ఆ హృదయంలో, మనసులో యింకిపోని ప్రేమ వుంది, కరిగిపోని కరుణ వుంది. ఆనందం వుంది. దుఃఖం వుంది. సాటివాని కష్టసుఖాలు అర్థం చేసుకునే సోదరత్వం వుంది. అనుభవం వుంది, అనుభూతి వుంది, పెనవేసుకుపోయే మిత్రత్వం వుంది. నిజాయితీగా బతికే ధీరత్వం వుంది. అవే యీ లోకాన్ని నడిపిస్తున్నాయి. అవే యీ కాలుష్యాన్ని కడుక్కుంటున్నాయి. నువ్వు ఎందుకనో నిరాశా జీవివైపోయావు. చీకటినే శ్వాసిస్తున్నావు. ఒక్కసారి మనసులోని ఉదయంవైపు తలుపులు తెరు, కారష్."

కారష్ తిరిగి నవ్వుతూ, మెల్లగా, కన్విన్స్ చెయ్యగలననే టోన్‌తో –

'సత్యా, నేను నిరాశా వాదిని కాను, వాస్తవ వాదిని. నువ్వు ఆదర్శజీవివి. నువ్వు చెప్పే ప్రేమ, ఆనందం, సహజత్వం, వగైరాలన్నీ వున్నాయి. కానీ, కొనవూపిరితో వున్నాయ్. స్వచ్ఛత, నిజాయితీ, ధైర్యం గల వ్యక్తులు లేరని కాదు కానీ, వాళ్ల సంఖ్య బాగా తగ్గిపోయింది. యింకా యింకా తగ్గిపోతుంది. స్వచ్ఛతను కాలుష్యం కాటు వేస్తూనే వుంది. నిజాయితీ అనేక రూపాల్లో హత్య చెయ్యబడుతూనే వుంది.

ఉదాహరణకి మా నాన్న విషయమే తీసుకో. జీవితాన్ని ప్రేమించాడు. చిన్నా పెద్దా లేకుండా అందర్నీ గౌరవించాడు. నిజాయితీకి నిబద్ధతకి మారుపేరుగా బతికాడు. ఉద్యోగంలో చట్టాలు, రూల్సు రెగ్యులేషన్స్ తు చ తప్పకుండా పాటించాడు. సర్కారు సర్వీస్ ఒక ధర్మంగా, తిరిగి దేనినీ కోరని మానవసేవగా భావించాడు. అడిగినవాళ్లకి లేదనకుండా సహాయం చేశాడు. జీతం చాలక అష్టకష్టాలు పడ్డాడు. ఇలా జరుగుతూ వుండగా, ఓ రాక్షస గూండా కాంట్రాక్టరు తాను చెయ్యని ప్రాజెక్టు పనిని చేసినట్టు రాసి బిల్లు పెట్టాడు. పాస్ చెయ్యమని తీవ్రంగా వత్తిడి చేశాడు. అతనికి రాజకీయ వత్తాసు వుంది. నాన్నకి పెద్ద మొత్తంలో లంచం యివ్వజూపాడు. ఆ పని చెయ్యకపోతే చంపేస్తానని బెదిరించాడు. దేనికీ ఆయన లొంగలేదు. ధైర్యంగా నిలబడినా, పోరాడలేని నిస్సహాయత, ధన, రాజకీయ రాక్షసం ముందు నీతి నిష్ఠ నిలబడలేక ఆయన్ని మింగేసింది. మా అమ్మ తట్టుకోలేక కుంగి కృశించి పైకి ఆయన దగ్గరకే వెళ్లిపోయింది. పదేళ్లకే నేను అనాథనైపోయాను. దుఃఖాన్ని మింగి బతుకు పోరాటంలో పడ్డాను. న్యూస్ పేపర్లు వేశాను. హోటళ్లలో పని చేశాను. పేవ్‌మెంట్ల మీద కునుకు తీశాను. రాజకీయ పార్టీల జెండాలు మోశాను. వాల్‌పోస్టర్లు అంటించాను. అయితే, మధ్యలో ఎన్నిసార్లు ఆగిపోతున్నా చదువుమాత్రం ఆపలేదు. కుంటుకుంటూనే, చిన్నాచితకా పన్లు చేస్తూనే ప్రైవేటుగా పి.జి. చేశాను. ఇందులో చాలావరకు నీకు తెలుసు." సిప్ చేస్తూ ఆగాడు కారష్.

"అవును. మనం ఎప్పుడన్నా తటస్థపడేవాళ్లం. నువ్వు

చెబుతుండేవాడివి. సరే మీ నాన్నకు చాలా అన్యాయం జరిగింది. ఇది చాలా ఘోరం. సందేహం లేదు. కానీ, దీన్ని అందరికీ వర్తింప జెయ్యలేం గదా". అన్నాడు సత్యానంద్.

"అందరికీ వర్తింజెయ్యడం లేదు. కానీ, రోజూ ప్రతి క్షణం యిదే విధంగా కాకపోయినా, నిజాయితీగా నిలబడే వాళ్లకి అన్యాయం జరుగుతూనే వుంది. అసలీ ప్రభుత్వాల్నే మెంటల్ హాస్పిటల్స్‌లో పెట్టాలి. కరెంట్ షాక్స్ యివ్వాలి. ప్రభుత్వమే పిచ్చిగా, క్రూరంగా ప్రవర్తిస్తూ వుంటుంది. దానివల్ల ప్రజల్లోని మంచితనానికి సత్ప్రవర్తనకి ఎంత హాని జరుగుతున్నదో పాలకులు గమనించరు. చిన్నతనం నుండీ బతుకుపోరులో అడుగడుగునా ఎన్నో అబద్ధాలు విన్నాను, క్రూరమైనవి చూశాను. చిన్న చిన్న అబద్ధాలు, పెద్ద పెద్ద అబద్ధాలు. రాజకీయంతో ప్రారంభమై సమాజాన్ని అల్లుకుని అబద్ధం చుట్టూ అంతా తిరుగుతోంది. జీవితం అబద్ధం. వ్యాపారం అబద్ధం. అంతా అబద్ధం. సర్వాంతర్యామిగా అబద్ధం చెలాయిస్తోంది. ఈ దారిలో స్వార్థం, అహంకారం, దురాశ, దుర్మార్గం, ఆత్మవంచన, పరవంచన, క్రూర మోసాలు, హత్యలు, దారుణాతి దారుణాలు. నాయకుల దుష్ట వ్యూహాల నుండి తప్పించుకోలేరు."

'కారష్, ఒక్క నిమిషం ఆగు. అబద్ధం ఆడవలసిన అవసరంలేని సందర్భాలు, డబ్బుతో కొనలేని మానవీయ విలువలు అసలు లేనే లేవంటావా' అన్నాడు గట్టిగా సత్యానంద్.

దానికి కారష్ – "నువ్వు అడిగేది విలువల గురించి కదూ, అటువంటి మానవీయ విలువలు గతంలో వుండేవి. ఆధునిక రాజకీయ నాయకత్వం రాకముందు రోజుల్లో వుండేవి. ఇప్పుడు లేవు, చనిపోయాయి. రాబోయే రోజుల్లో, అటువంటి విలువలు ఒకప్పుడు వుండేవనే విషయం కూడా బహుశా మనిషి మరచిపోతాడు. అంతేకాదు, 'డబ్బుతో' దేన్నయినా కొనవచ్చు' అని అనుకుంటూ వుంటాం. ఇప్పుడు అది కూడా పాతబడిపోయిన జరిగిపోయిన

మాట. ఇవాళ మనుషుల్నే కాదు, విలువల్నే కాదు, ఆత్మల్నేకాదు, డబ్బుతో డబ్బునే కొనవచ్చు. ఆ దశను కూడా దాటాం. మనమిప్పుడు ధనయుగం దాటి ప్రచారయుగంలోకి ప్రవేశించాం. ప్రచారంతో మనమిప్పుడు డబ్బు చెయ్యలేని ఎన్నో పనులను సైతం చెయ్యగలం.

ప్రచారంతో అబద్ధాన్ని నిజం చెయ్యగలం. నిజాన్ని, పచ్చి నిజాన్ని, అబద్ధంగా చిత్రించగలం. నీకిక్కడ యింకోవిషయం కూడా చెప్పాలి. మనం కాల ప్రవాహంతోబాటు అనేక దశలను దాటుకుంటూ వెడుతున్నాం. ఆ క్రమంలో, ప్రచారంతో ఒక అబద్ధాన్ని నిజమని ప్రజలను నమ్మించడం, నిజాన్ని అబద్ధం చెయ్యగలగడం అనేది కూడా ఒకప్పటి దశ అయిపోయింది. ఆ దశను కూడా దాటాం. కాలం చాలా వేగంగా పరుగెడుతోంది. బ్రాహ్మడు – మేక కథ, గోబెల్స్ విధానం యివి కూడా దాటాం. ఈ శతాబ్దంలో మనిషి సాధించినది ఏమిటో తెలుసా, అదే ప్రచార కళ. 'ప్రచారం' అనేది ఒక శక్తివంతమైన ఆయుధం. దానితో ఒకప్పుడు వునికిలో వుండిన నిజాన్ని యిప్పుడు అబద్ధంగా ప్రచారం చెయ్యగలం. ప్రజల మనస్సుల్లోంచి నిజాన్ని తుడిచెయ్యగలం. అంతేకాదు, ఆ నిజం ఎప్పటికీ బయటపడకుండా చంపేసి పాతిపెట్టెయ్యగలం. తమాషా ఏమిటంటే, యివాళ ఆ దశను కూడా దాటాం. నిజంతో సంబంధం లేకుండానే ఒక అబద్ధాన్ని స్వతంత్రంగా సృష్టించగలం. అంటే, తల్లీ తండ్రీ లేకుండానే శిశువును పుట్టించడమన్నమాట. అబద్ధం స్వయంభువు అయిపోయింది. ఇవాళ నిజం చెప్పి నమ్మింప చెయ్యడం కష్టం. ప్రచారం ద్వారా అబద్ధాన్ని సృష్టించి, అదే సిసలైన నిజమని జనం రక్తంలోకి ఎక్కించగలం. దీనిని కనిపెట్టిన వారు, సాధించిన వారు, శక్తివంతంగా ప్రయోగించే వారు రాజకీయ నాయకులు". కారష్, కాస్త ఆగి, గ్లాస్ నింపుకున్నాడు. రెడ్‌గ్రేప్ గ్లాసులో యీదుతోంది.

'కారష్, నీకు యిన్ని విషయాలు లోతుగా తెలుసుగదా. సమాజంలోను, రాజ్యంలోను మార్పులు తీసుకు రావడానికి బలమైన సంస్కరణోద్యమం ప్రారంభించవచ్చు గదా!' అన్నాడు సత్యానంద్.

'మొదట్లో అట్లాగే అనుకున్నా. సమాజంలోని సానుకూల విలువలన్నీ

చాలావరకు దొంగల రాజ్యం వల్ల కుళ్లిపోయాయి. యింకా కుళ్లవలసింది కొంత మిగిలి వుంది. అది కూడా పూర్తయ్యాక, జనం యీ కుహనా నాయకుల పిశాచ స్వరూపం చూశాక, సంస్కరణల దశ తిరిగి కొత్తగా ప్రారంభమవుతుంది. అంతవరకు, అన్ని విలువల అంగాలన్నీ పూర్తిగా కుళ్లిపోవడమనే ప్రక్రియను వేగవంతం చేస్తే చాలు.

సరే, వుండబట్టలేక యివన్నీ మాట్లాడేశా. ఇంతకీ నే చేసే పనేమిటో నీకు తెలుసా. ఒకప్పుడు పేవ్‌మెంటు మీద బతికినోణ్ణి. యివాళ కోట్లకి పడగలెత్తినవాణ్ణి. ఫైవ్‌స్టార్ హొటల్లో పడుకునే వాణ్ణి. చెప్పు - నా వుద్యోగమో, సద్యోగమో, కార్యకలాపమో నే చేసేదేమిటో నీకు తెలుసా!

'తెలుసు. ఏవో కొన్ని కంపెనీలకు సలహాదారుడివని తెలుసు' అన్నాడు సత్యానంద్.

'నా గురించి పూర్తిగా నీకు తెలీదు. నేను కొన్ని పెద్ద కంపెనీలకు, వ్యక్తులకు సలహాదారుడినే. అంతకంటే ముఖ్యంగా, నేను వ్యాపారస్తుణ్ణి కూడా. అది నీకు  తెలీదు. సలహా, సలహాలతో మిళితమైన వ్యాపారం నాకు ముఖ్యమైనది. నా వ్యాపారం చాలా ఆధునిమైనది. మానవుడి మెదడును, అంటే ఆలోచనా సరళిని నేననుకున్న విధంగా మార్చుకునే వ్యాపారం.

నా క్లైంట్స్ ఎవరో తెలుసా. కొన్ని కంపెనీల యజమానులు, కొన్ని రాజకీయ పార్టీల నేతలు, యితరత్రా సమాజంలోని ప్రముఖులు. వారికి సలహాలు యివ్వడం నా వ్యాపారం. నా వ్యాపారానికి, ముడి సరుకు 'అబద్ధం'. పెట్టుబడి 'అబద్ధం'. నేను 'అబద్ధాలు' అమ్ముతాను. 'మహా అబద్ధాలు'. అవి చాలా శక్తివంతమైనవి. చరిత్రగతిని నిర్దేశిస్తాయి. కాలప్రవాహం దిశను మారుస్తాయి. కార్పొరేట్ కంపెనీల దిగ్గజాలు ఆ 'అబద్ధాలు' కొనడానికి నా వద్దకు వస్తారు. వీళ్లు తిమింగలాలు. యితర కంపెనీలను మింగెయ్యడానికి, వాటి పరువు ప్రతిష్టలు మంట గలపడానికి, ఓడలు బళ్లు కావడానికి యీ అబద్ధాలను వినియోగిస్తారు.

ఇంక, రాజకీయ నాయకులు తమ సొంత 'ఇమేజ్' పెంచుకోడానికి,

సమాజంలో ఏర్పడే పెద్ద సంఘటనలను తమకు అనువుగా మలుచుకోడానికి, ప్రజల దృష్టి కొన్ని నిజాలపై పడకుండా చెయ్యడానికి, తద్వారా రాజకీయ సామాజిక ఆర్థికాంశాలను పరోక్షంగా తమ అధీనంలోకి తెచ్చుకోడానికి నేను కల్పించే 'అబద్ధాలు' కొనడానికి నా వద్దకు వస్తారు. ఒక్కొక్క 'అబద్ధం' విలువ ఒక కోటి నుండి పది కోట్ల వరకు వుంటుంది. నా ఫీజు ముందే వసూలు చేస్తాను. ఆ తర్వాత – ఆ అబద్ధాన్ని ఏ రూపంలో, ఏవిధంగా ప్రచారంలో పెట్టాలో ఆ టెక్నిక్ కూడా చెబుతాను.

నేటి ప్రపంచం చాలావరకు రాజకీయ నాయకుల అబద్ధాలమీదనే నడుస్తోంది.

ఉదాహరణకి, నేనొక 'అబద్ధాన్ని' సృష్టిస్తాను. అది ప్రచారం ద్వారా జనంలోకి వెడుతుంది. జనం అది నిజమని భ్రమిస్తారు, నమ్ముతారు. అది వాళ్ల మనస్సుల్లోకెళ్లి అక్కడ స్థిరపడుతుంది. క్రమంగా దానికి బానిసలైపోతారు. ఆ తర్వాత అదే చరిత్ర వేషం వేసుకుంటుంది. జాగ్రత్తగా గమనిస్తే, జ్ఞానం, విజ్ఞానం అని మనం అనుకునేటటువంటివన్నీ ప్రచారయంత్రం కల్పించినవే. ప్రచార యంత్ర కక్ష్యకు వెలుపల వుండే వారి సంఖ్య ప్రపంచంలోనే బహు తక్కువ. వాస్తవం, తర్కం, విశ్లేషణ మొదలైనవన్నీ పాతిపెట్టబడతాయి. ఆ సమాధులపై నిలబడి ప్రచారయంత్రం మాట్లాడుతుంది.

"ఇంతకీ, యివాళ నీకో విశేషం చెప్పడానికే రమ్మన్నాను. చాలారోజులుగా చెప్పాలని వుంది. యివాల్టికి వీలయింది.

కార్పొరేట్ కంపెనీలు, కార్పొరేట్ కంపెనీల వంటి నేటి రాజకీయ పార్టీలు, యివేకాదు, వీటికి సంబంధించినవేకాదు, మొత్తం సమాజంలోని, అన్ని రంగాల్లోని అన్ని రకాల సెంటిమెంట్లు, నమ్మకాలు, విశ్వాసాలు, – యివన్నీ నా 'అబద్ధాల' వ్యాపారానికి ముడి సరుకులు, పెట్టుబడులు.

నేను సృష్టించే 'అబద్ధం' కాల్పనిక కళలో ఒక భాగం. మనస్తత్వ శాస్త్రంలోని అస్త్రం. అమధ్య జయప్రదమైన ఒకానొక నా కాల్పనిక ప్రయోగం గురించి చెబుతాను. జాగ్రత్తగా, విను.

'ఆకాశదేవర' నేను కల్పించిన ఒక 'అబద్ధం'. కొండమీద గుడి నేను కట్టించిందే. ఆకాశవాణి స్వప్న వృత్తాంతం, గుడి – శూన్యం తాత్వికత నా కల్పనే. శూన్యస్వామి, షణ్ముఖానంద, వాళ్ళకింద పనిచేసే వాళ్ళంతా నా ఏజెంట్లే. ఇద్దరు ఎం.పి.లను, నలుగురు ఎం.ఎల్.ఎలను కొన్నాను. అక్కడ తిరిగే బస్సులు, షాపులు మొదలైనవన్నీ నా మనుషులవే. ఆకాశదేవర దేవాలయంపై ప్రచార సామగ్రి, యీ పుస్తకాలు నేను రాయించినవే. అయితే, వీళ్ళు నా ఏజెంట్లనీ, నా మనుషులనీ, నా రచయితలనీ వాళ్ళకి తెలీదు. నేటి టెక్నాలజీ విప్లవంలో అసలు వ్యక్తి కనబడకుండా, అదృశ్యంగా ఎన్నో పనులు చెయ్యవచ్చు. అదే సుప్రా టెక్నో నెట్‌వర్క్

ఈ నెట్ వర్క్‌లో నేరుగా యిద్దరు వ్యక్తులు పాల్గొనరు. ఒకరు ఆదేశించింది, మరొకరు చేసేది అన్నట్లుగా వుండదు. ఇందులో అనేకమంది అంచెలంచెలుగా పాల్గొంటారు. వారెవరికీ సంబంధాలుండవు. ఇదంతా లింకు కనబడని ఇన్విజిబుల్ సర్కిల్.

అలా, వీళ్లంతా నా ఏజెంట్లనే విషయం వాళ్ళకి ఎప్పటికీ తెలీదు.

మరో వుదాహరణ – 'ఆకాశ దేవర' దేవాలయ నిర్మాణంలో రహస్యంగా స్థపతితో సహా, యిరవైమంది పాల్గొన్నారు. నిర్మాణం పూర్తయ్యాక యిళ్లకు కృష్ణానదిపై పడవలో వెళుతుండగా, పడవ మునిగి అంతా చనిపోయారు. మునక సహజంగానే ప్రమాదవశాత్తూ జరిగిందా, వీళ్లని చంపెయ్యడానికి, జలసమాధి చెయ్యడానికి ప్లాన్ జరిగిందా. వీళ్ళు బతికి వుంటే ఆ గుడి రహస్యం బయట పడుతుందనే ఆలోచన కూడా వుందా. నెట్‌వర్క్‌లో అదొక భాగం.

చివరిగా, అతి ముఖ్యమైన విషయం ఒకటుంది. అది కూడా చెబుతా.

ఆ గుడిలో వెనక వున్న 'మహాశూన్యం' గదిలోకి భక్తులు విసిరే నాణేలు, నోట్లు నాకు చేరతాయి" అని, గట్టిగా నవ్వాడు.

సత్యానంద్ నివ్వెరబోయాడు. తరువాత, నెమ్మదిగా తేరుకుని -

'నువ్వు కారష్వా, కాపురుష్వా' అన్నాడు.

'నేను రెండూను. ఈ ప్రచార యుగానికి చెందిన కారష్ని. ఈ కుహనా వ్యవస్థల్లోంచి వచ్చిన కాలిక కాపురుషుణ్ణి. వజ్రాన్ని వజ్రంతో కోసినట్లుగానే, ముల్లును ముల్లుతో తీసినట్లుగానే, అబద్ధాన్ని అబద్ధంతోనే ఎదుర్కొంటాను."

గ్లాసులోని చివరి బిందువులు గొంతులోకి జారాయి. మిస్టర్ కారష్, రెడ్‌గ్రేప్‌ని కసిగా తినేశాడు.

●

●

ఆకాశదేవర

# అనుబంధం

# AKASA DEVARA : A MODERN PARABLE

What is poetry which does not save
Nations or people?
A connivance with official lies,
A song of drunkards, whose throats will be cut in a moment,
Readings for sophomore girls.
- *Czeslaw Milosz*

No one could agree more with the above than Nagnamuni who took poetry as sacred vocation quite early in his career. He retains still an undying hope in the redemptive power of the poetic word despite the brutal and total philistinism of the times.

By no means a prolific poet, considering his nearly half a century engagement with poetry, Nagnamuni is nothing if not subversive in his uncompromising critique of all that is hollow, false and vulgar in the institutions that tend to shape and influence the mind-set of common men and women.

Back in the early sixties, on the eve of Diwali, I came across an opening line of a poem by one Kesava Rao (later known as Nagnamuni) in a Telugu weekly reverberations of which could be felt in all that he wrote later. Here was a poet, I thought then, who discovered his poetic identity and voice so early in his career without any traces of anxiety of influence of his precursors. That was my first encounter with a Nagnamuni text whose impact continues to remind me of what to expect of this poet. His signature is writ large in later poems and writings with the same intensity, seriousness and trenchant irony.

Not for him the gentle satire which tickles you while it wounds. He would rather opt for unveiling the hidden truth behind all subterfuges and pretences masquerading as reality beguiling the public mind. In fact he appears at times as an elegist lamenting the loss of all that is human from the human being.

If we define the poet as the most conscious point of society, he would answer that description with unmatched accuracy. Poem after poem attest to his continuing concern with governmental corruption and corporate complicity robbing the common man of his self-esteem and freedom.

In all this he would not absolve the responsibility of the common man in his reluctance to resist and take a stand against the evils of society.

He is a proactive poet who is also a whistle blower with a well developed early warning system in words of exceptional clarity, vigor and vitality.

With Digambara movement, he violated all conventional norms in order to assert his right to express extreme disgust at the sorry scheme of things. Chastened by the experience of taking language to the farthest limit one could take in stripping naked all trappings of decorum with which society wraps itself, he moved once again into yet another experiment during the emergency. This time in prose fiction with "Viloma kathalu." Everything appeared topsy-turvy and upside down and quite appropriately he introduced the technique of dehumanization to satirize the follies and distortions of the times. As always without losing his unerring insight into the ways in which the average mob would be manipulated by the people in authority. Most of these pieces are still relevant and have acquired universal validity. These are pure vintage Nagnamuni.

And then came his magnum opus, Koyya Gurram wherein he spent almost the last farthing of his imagination to deploy a pervasive irony in metaphor and symbol against the inequity inherent in any act whatsoever of government and the deep complicity of those who profit by governmental action.

What more can be said? Having exhausted the resources of all verbal devices, can you still pursue this trade to raise the consciousness levels of human kind? The poet offered to go in search of an igniting fuel to set fire to the Wooden Horse which was made to stalk the entire poem of that title. For one thing he did ignite the cliche in his experiments with language and metaphor even as he doubted the capacity of the word. Did he for once think that he should communicate in common language a modern parable that would be understood by all? His poetry was experienced even before it was understood. In the process some may have missed as Eliot would say: we have had the experience but missed its meaning.

In his current attempt he would ensure that meaning is understood on the first reading itself. I am referring now to "Akasa Devara", his latest foray into prose fiction. This time round, he offers a straight forward narrative about a very topical subject involving the nexus of political power, corporate greed, and media complicity against common man's gullibility. Once again he deals with the dangers the nexus poses to society. It is a modern parable with age old ingredients and modern variants combining to produce a cocktail of deadly potential - a portent and a threat to all values of Democracy. The narrative encapsulates the lethal connection between politics, media, muscle and money not to speak of propaganda and falsehood. What is seen as a relentless quest for the conquest of the human mind for exploitation by the power structures of society is center staged in the actions of the protagonist.

Here is a protagonist who has had a difficult childhood, orphaned at ten having lost both parents, fending for himself against all odds, climbing the social ladder by degrees all the while seeing life in the raw. He comes through as one who could be a model for all young men. That is where he upsets conventional expectations. He becomes a superb conman mastering all the tricks required for peddling falsehood and propaganda to the high and the mighty. He is seen as one who could manipulate meaning to suit his clientele to create outright falsehood and pass it off as truth. He deals in the business of creating falsehoods, and for a fee could destroy truths. He is a power broker for a tech savvy 21 century by just sitting in his office to operate invisibly in arranging image management for politicians, takeovers for corporate honchos, crisis management for companies-literally anything and everything under the sun. His business makes him more powerful than the clients whom he serves. Would he remain an eternal middleman serving his clients with professional rectitude? With so much talent and intelligence, would he not be open to temptation of wielding power himself? Why play second fiddle even if it is for money? An open question.

He sought on his own admission to find an effective method to influence and sway the workings of the human mind for permanent subjugation. This is precisely what every politician, be it a small town street corner youth or a state corner leader, dreams of getting. In the era of globalization, technology to persuade and coerce a whole population to submit their freedom to a leader is available for the asking. One can 'outsource' anything including waging a battle against your sworn enemy. You shouldn't be surprised if the outsourcing contractor turns out to be the same for both your enemy and yourself. Technology today is a double-edged weapon.

Nagnamuni holds out a hope that the protagonist would turn out to be good for society. He couldn't be sure. He could turn either way. There is no guarantee that the power broker does not become a power monger himself given the strength of his potential. A prospect terrible to contemplate! Let us not forget that he is just a character in a story but fiction has a way of surprising reality.

Fifty years ago when Van Packard published "The Hidden Persuaders" in the US, there was an outcry from the public. Packard seems to have defended himself: 'we could choose not to be persuaded'. Today you are not sure.

It was Chomsky who said in one context that the USA is the freest of countries where the mind of man is constantly shackled. Such is the power of politics and media mix.

And what shall we say of our country or even of our state? Worthy of debate, isn't it?

Akasa Devara provides an alibi for an informed debate about the implications of what is presented in the narrative as an unequal contest

between the freedom and choice of common men on the one hand and the vested interests of the power centers in society on the other.

A genuine writer sometimes legitimizes in his work what is incubating in society. In other words, the writer gives a 'local habitation and a name' to whatever is supposed to be latent in society. If that is true, does the story endorse in the person of the protagonist the use of 21 century technology for thought-control in public life? We are already witness to an increasing nexus between politicians and criminals, money and media, government and industry. We are also witness to the rape of the environment by unscrupulous corporates who are in the business of privatizing profits and socializing the costs. We are silent witnesses to democratically elected leaders democratically succeeding while the institutions they administer totally failing. The leader's success, in this case, is in inverse proportion to the failure of the institution.

Do we also sense a latent lust for tyranny, tyranny of the sort outlined above, in the mind of the public at large? This does not bode well for democracy.

For evil to succeed, we are told, the good has only to be silent. Can we afford to be silent?

Where the Mind is free and the Head held high
There be the poet's permanent habitat -
The habitat of the human heart

For Shelley Poet is the 'unacknowledged' legislator, the phrase carrying a hint of self-pity. What if he is unacknowledged? The Poet remains still the legislator, yes, legislator of the unacknowledged world, the true voice of all those oppressed and suppressed but still unvanquished millions that constitute 'the wretched of the earth'.

The Poet's task remains incomplete until he 'forges the uncreated conscience' of the wretched of the earth. Only then will he escape the charge of connivance with official lies.

This brings me back to 'Akasa Devara' which sends out a wake up call in terms of a parody like parable to all aware and concerned citizens to preserve their sanity and resist the madness poised to engulf the 21st century mind.

**- Prof. C. Subbarao**
Former Chairman, AP State Council of Higher Education

# ఆకాశదేవర-నగ్నముని-విలోమకథ

జాతినీ, దేశాన్నీ కాపుకాయలేని కవిత్వం కవిత్వమేనా అంటూ ప్రశ్న విత్తు నాటారు జెస్లా మిలాజ్.

అక్షరాలా కవి బాధ్యతను గుర్తెరిగి సాహితీసేద్యం చేశాడు. **దిగంబర కవి 'విలోమ' కథకుడు 'కొయ్యగుర్రం' ఆధునిక మహాకావ్యకర్త, మాలపిల్ల నాటకకారుడు 'నగ్నముని'.**

ముఖ్యంగా కవిగా తొలినాళ్ళ నుంచి కవిత్వాన్ని పవిత్రకార్యంగా, క్రూర కర్కశ కాలాన్ని ఎదిరించి నిలబడగల ఆశావాదంగా భావించి భాసిల్లాడాయన!

అయిదు దశాబ్దాలకు పైబడ్డ చూపు నగ్నమునిని అగ్రశ్రేణి ఆధునిక కవిగా నిలబెట్టింది. సమాజ స్రవంతిలో అసత్య, అసభ్య సందర్భాలను చీల్చుకుంటూ, సామాన్యుల పక్షం వహిస్తూ రాజీలేని విమర్శకునిగా రాటుదేలారు నగ్నముని.

అరవైలలో దీపావళి సందర్భంగా ఓ తెలుగువారపత్రికలో నేను తొట్టతొలుతగా నగ్నముని పంక్తులు చదివి వివశుడ్ని అయ్యాను. అతని కవితా వాడి ఇప్పటికీ నా ఎదలోతుల్లో అలా ఉండిపోయింది. అదే భావతీవ్రత, గాఢత, సూదిమొనలాంటి వ్యంగ్యం రానురాను నగ్నమునిని సామాజిక చైతన్యం కాంక్షించే కవిగా మలిచాయి. దాచేస్తే దాగని సత్యాన్ని పాఠకులు దర్శించేలా కవితా మహేంద్రజాలం చెయ్యగల దార్శనికుడు నగ్నముని. ప్రతి కవితలోను వాస్తవికతకు బ్రహ్మరథం పడుతూ సామాన్యులకు జరుగుతున్న దోపిడీని, ప్రభుత్వపరంగా పేరుకుపోయిన అవినీతిని ఎండగట్టారాయన.

సామాజిక రుగ్మతల పట్ల పాఠకుల్లో జాగరూకత కలిగించిన నగ్నముని సామాజిక బాధ్యత ముదావహం. పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేయడంలో నగ్నముని కవిగా స్పష్టత, శక్తియుక్తులూ చూపాడు కనుకనే విలక్షణ కవిగా

వినుతికెక్కాడు. దిగంబర కవితోద్యమంలో భాగంగా 1965-68లలో సంప్రదాయాల్నీ, దాని కుళ్ళునీ తుంగలో తొక్కి తనదైన ధిక్కారస్వరం వినిపించాడు. వ్యవస్థను చీల్చి చెండాడు. లోపభూయిష్టమైన సమాజాన్ని కళ్ళకు కట్టినట్లు నగ్నంగా చూపాడు. ఆ దిశగా కవిత్వభాషను మరింత శక్తివంతం చేశాడు. అత్యయిక పరిస్థితిని దేశంలో విధించిన సందర్భంలో నగ్నముని నిప్పుకణికగా మారాడు. మానవ తప్పిదాలపై అధిక్షేపాత్మక ధోరణిలో నగ్నముని విలోమకథలు రాశాడు. సార్వకాలీనతకి నిలువుటద్దం నగ్నముని అక్షరం.

నగ్నముని అనగానే మదిలో మెదిలేది **'కొయ్యగుర్రం'**.

దివిసీమ ఉప్పెన నేపథ్యంలో పాలకులు ప్రజలపాలిట కొయ్య గుర్రాలుగా మారిన వైనాన్ని, ఎటూ కదలలేక ఆపన్నహస్తం అందించలేక చచ్చుబడ్డ పచ్చి నిజాన్ని వెళ్ళకక్కుతూ ఆధునిక కావ్యాలకు ఒరవడి దిద్దింది 'కొయ్యగుర్రం'. కావ్యం ఎక్కడా 'ఉప్పెన' అన్న మాటను ప్రయోగించకుండానే తనదైన పరిపక్వతను ప్రదర్శిస్తూ రచనా పటిమ ప్రతీకాత్మకంగా కనబరచాడు నగ్నముని. వచన కవిత్వంలోని అస్పష్టత నగ్నమునికి వర్తించదు. సరళసుందరంగా తనదైన పదచిత్రాలతో, సూటిదనం పొడుచుకొచ్చే శిల్పంతో మహాకావ్యంగా తీర్చిదిద్దారు. ఉత్తమ కవిత్వం అనుభవైక వేద్యమైందే కానీ ఇదీ అని చెప్పలేనిది. అనుభవం ప్రతిఫలించడం ఎంత ముఖ్యమో అది అర్థవంతంగా ఉండటం అంతే ప్రధానం. నగ్నముని భావన కూడా ఇదే. కవిత తొలిగా చదివినంతనే అర్థం ఒంటపట్టాలి.

ఈ పరంపరలో నాకు వెంటనే గుర్తొచ్చే నగ్నముని రచన **'ఆకాశదేవర'**.

సామాన్యులకు గుదిబండగా పరిణమించిన రాజకీయ అధికారాన్ని తూర్పారబడతాడు నగ్నముని. ప్రజాస్వామిక విలువలకు ఉద్దీపన నగ్నముని రచన. నాయకులు అధికారదాహంతో వ్యవస్థను దిగజార్చుతున్న వైఖరిపై నగ్నముని నిప్పులు చెరిగాడు. పదోఏట అనాథగా మారిన కథానాయకుడు అంచెలంచెలుగా జీవితంలో ఎదగటం దీని ఇతివృత్తం. నైతికతకు ఉప్పుపాతరలేసి అన్ని అడ్డదారులూ తొక్కి అధికారంతో రాజకీయాల్నీ, వ్యాపార సామ్రాజ్యాన్ని శాసిస్తాడా నాయకమ్మన్యుడు. ప్రపంచీకరణ పడగవిప్పిన

సమాజంలో పౌరుల స్వేచ్ఛను హరించే క్షుద్రరాజకీయ వ్యవస్థకు అక్షర దర్పణం ఈ రచన. రాజకీయాలు ప్రజల ఆశలకు అలంబనగా నిలవాలని కాంక్షిస్తారు.

యాభైయేళ్ళ క్రితం వాన్ ప్యాకార్డ్ 'ద హిడెన్ పర్సుయేడర్స్' అనే పుస్తకాన్ని అమెరికాలో వెలువరిస్తూ ప్రజల ఆక్రందనను అక్షరబద్ధం చేశాడు. మనం దేనినైనా ఎంపిక చేసుకోగలం కానీ మనల్ని ఎవరో ఒప్పించ కూడదంటాడాయన. నోం చాంస్కీ అనే ప్రపంచ ప్రసిద్ధ భాషావేత్త అమెరికాను స్వేచ్ఛామయదేశంగా చెబుతూ అక్కడి ప్రజలకు స్థిరచిత్తం లేదని దుయ్యబడతాడు. మనదేశం, మన రాష్ట్రం గురించి మన మాటేంటి? దీన్ని చర్చకు పెడుతుంది ఆకాశదేవర. సంఘంలోని అధికార స్థానాలు, వాటి ఆసక్తులు, ప్రజల స్వాతంత్ర్యం సమస్యాత్మకంగా పరిణమించటాన్ని ఈ రచన పట్టి చూపుతుంది.

అసలు సిసలు రచయిత ముందున్న లక్ష్యం సమాజ ప్రక్షాళన. రాజకీయాలకు, నేరాలకు మధ్య సాన్నిహిత్యం ప్రజాస్వామ్యానికి శాపం. పెట్టుబడిదారి వ్యవస్థ విషఫలాల్ని ఇప్పటికే మనం రుచి చూస్తున్నాం. దీనికి రాజకీయం తోడై ప్రజాస్వామ్యం గాలిలో దీపమైపోయింది. నాయకుల విజయం ప్రజాస్వామ్య అపజయంగా తిరగబడింది. ఈ నియంతృత్వ ధోరణిని మనం ఉపేక్షించకూడదు. మనం మౌనం విడనాడాలి. టాగోర్ నుడివినట్టు మన మస్తిష్కం స్వేచ్ఛా వాయువులు పీల్చాలి. మనం తలెత్తాలి. షెల్లీ చెప్పినట్లు కవులు అనధికార శాసనకర్తలు.

కవి జాతిని మేల్కొలిపేవాడిగా ప్రతిబింబించిన విశిష్టరచన ఇది.

-ప్రొ॥ సి. సుబ్బారావు

పూర్వాధ్యక్షులు, ఆం.ప్ర. రాష్ట్ర ఉన్నత విద్యామండలి

# విలోమవ్యవస్థ: అనులోమ కథ

"ఒకప్పుడు వునికిలో వుండిన నిజాన్ని యిప్పుడు అబద్ధంగా ప్రచారం చెయ్యగలం. ప్రజల మనసుల్లోంచి నిజాన్ని తుడిచెయ్యగలం. అంతే కాదు. ఆ నిజం ఎన్నటికీ బయటపడకుండా చంపేసి పాతిపెట్టెయ్యగలం. తమాషా ఏమిటంటే, యివాళ ఆ దశను కూడా దాటాం. నిజంతో సంబంధం లేకుండానే ఒక అబద్ధాన్ని స్వతంత్రంగా సృష్టించగలం. అంటే తల్లీతండ్రీ లేకుండానే శిశువును పుట్టించడమన్నమాట. అబద్ధం స్వయంభువు అయిపోయింది".

"ఉదాహరణకి నేనొక "అబద్ధాన్ని" సృష్టిస్తాను. అది ప్రచారం ద్వారా జనంలోకి వెడుతోంది. జనం అది నిజమని నమ్ముతారు. అది వాళ్ళ మనసుల్లోకెళ్ళి అక్కడ స్థిరపడుతుంది. క్రమంగా దానికి బానిసలైపోతారు. ఆ తర్వాత అదే చరిత్ర వేషం వేసుకుంటుంది. జాగ్రత్తగా గమనిస్తే జ్ఞానం, విజ్ఞానం అని మనం అనుకునేటటువంటివన్నీ ప్రచార యంత్రం కల్పించినవే".

(ఆకాశదేవరలో కారప్)

మనుషులకు జ్ఞానం కావాలి. జ్ఞానం సంతృప్తినివ్వని చోట మరేదో దాన్ని భర్తీ చేయాలి. తమ సందేహాలను, సంశయాలను, ఆకాంక్షలను ఏదో ఒక ప్రతీకలోకి ఒంపి, దాన్ని మార్మికం చేసుకోవాలి. హేతువుతో, సమాధానాలతో నిస్సారత ఆవరించకుండా, ఒక మాంత్రిక వాస్తవికతా కావాలి. తరచి తరచి శోధించే తపనా, ఇది అర్థం కాలేదులెమ్మన్న నిర్లిప్తతా రెండూ కావాలి. చరిత్రను, వర్తమానాన్నీ, భవితవ్యాన్నీ క్రమంలోనో, అపక్రమంలోనో, సంబంధంలోనో, అసంబంధంలోనో వ్యాఖ్యానించే

పురాణాలూ కావాలి. మనుషుల ఆదిమ అవసరం ఈ రకం సాధనాలు తీరుస్తాయి. ఇవి అజ్ఞానాలు కావు. మరో రకం జ్ఞానాలు. ప్రకృతి శక్తులను మనుషులుగానో దేవతలుగానో సంభావించినా, మనుషుల నిష్ఠలకు పరంపరాగత తంతులకు అతీత శక్తులను ఆపాదించినా-అది బాహ్య ప్రపంచాన్ని మానవుల మనుగడతో సంలీనం చేసే తాత్వికతలు.

ఈ మార్మికతను, మాంత్రికతను, పౌరాణికతను నాటి నిసర్గత నుంచి, ప్రమాదరాహిత్యం నుంచి పెకిలించివేసి, సమాజాలను, ప్రజలను నియంత్రించే సాధనాలుగా వాడుకోవడం కూడా ఏనాటినుంచో మొదలయింది. సత్యాన్ని అస్పష్టమూ గందరగోళమూ చేయడానికి, జనాన్ని మాయలో పడవేయడానికి, భయపెట్టే, లొంగదీసుకునే ఆయుధాలుగా ఉపయోగించుకోవడానికి సమష్టి నుంచి విడివడిన పాలకులు, పూజారులు, వారి భృత్యులు ప్రయత్నించి తరచు సఫలమవుతూనే ఉన్నారు. ధనానికి, అధికారస్థానాలకు, మార్కెట్‌కు, సరుకులకు, వక్రీకరించిన జ్ఞానానికి ఒక కాంతిపరివేషాన్ని కల్పించి, ప్రజల్ని మైమరపిస్తూనే ఉన్నారు.

జనచేతనలో ఏదో ఒక పునాది ఉన్న మాయను అపహరించి, తమ పెరట్లో కట్టేసుకోవడం వేరు. ఏ పునాదీ లేని, వాస్తవలేశమూ లేని మాయను సృష్టించడం వేరు. ఇప్పుడు కాలం ఇటువంటి అబద్ధాల సృష్టికి అనువుగా మారినట్టుంది. దేవతావస్త్రాల వాస్తవికత ప్రపంచమంతా అలుముకున్నట్టుంది. స్థానికంగా, దేశీయంగా ఎక్కడికక్కడ ఏర్పడిన చిన్న చిన్న మాయలను తోసిరాజని ఒక గ్లోబల్ మాయ వ్యాపించినట్టుంది. ఆ మాయ పేరు భారతీయభాషలో అభివృద్ధి కావచ్చు. అమెరికన్ మాండలికంలో స్వేచ్ఛ కావచ్చు. అంతర్జాతీయ ఉగ్రవాదం కావచ్చు. మొత్తంగా ప్రపంచీకరణ కావచ్చు. ఈ మాయ గురించే కావచ్చు, నగ్నముని 'ఆకాశదేవర' కథ రాశారు. ఏమీ లేని శూన్యం నుంచి ఒక పెద్ద అబద్ధాన్ని సృష్టించడం, ఆ శూన్యాన్ని లోకం ఆరాధించడమూ నగ్నమునికి కలవరం కలిగించాయి. ఆగ్రహం తెప్పించాయి. ఎవరు ఎవరిచేత ఏ పని చేయిస్తున్నారో ఎవరికీ తెలియని

నెట్‌వర్క్ ఒకటి పరిణామాలను నడిపిస్తున్నదని ఆయన సరిగ్గా కనిపెట్టారు. జనాలను మోసపుచ్చే మాయను కల్పించే చట్రాన్ని, అందులోని సూత్రధారుల చుట్టూ ఉండే అత్యాధునిక మార్మికతను కూడా ఆయన గుర్తించారు.

కారష్ ఈ కథలోని నాయకుడు. కాదు, ప్రతినాయకుడు. అతను మూడు పదులునిండని వాడే. కానీ, కళ్ళు మిరుమిట్లు గొలిపే సంపన్నుడు. అతనికి అనేక ఇళ్ళు, అనేక ఆఫీసులు, ఆయా మనస్థితులకు అనుగుణమైన పానీయాలను, సౌఖ్యాలను అతను సేవిస్తాడు. అతని గురించి అతని వ్యక్తిగత ఉద్యోగికి కూడా తెలియదు. అతనొక రాజప్రసాదం వంటి హోటల్‌లో ఒక సూట్‌లో ఉన్న పర్సనల్ కార్యాలయంలో ఉండగా కథ మొదలవుతుంది. ఆకాశదేవర–అనే పేరుతో జనంలో వేలం వెర్రిగా ఉన్న ఒక ప్రాచీన దేవాలయం గురించి పరిశోధించిన ఒక పురాతత్వ శాస్త్రవేత్త కారష్‌ను కలిసి తన పుస్తకాన్ని ఇవ్వడానికి వస్తాడు. పుస్తకాన్ని తీసుకుని, అతన్ని కలవకుండానే పంపిస్తాడు కారష్. తీరిగ్గా కూర్చుని, ఎర్రద్రాక్ష పండు వేసిన గ్లాసులో మద్యాన్ని సేవిస్తూ 'ఆకాశదేవర' పుస్తకాన్ని అతను చదువుతాడు. చదివి, తన సన్నిహిత మిత్రుడు సత్యానంద్‌కు ఫోన్ చేసి పిలిపించుకుంటాడు. అతను వచ్చాక, కాసేపు పెళ్ళి గురించి చర్చిస్తాడు. ఆ చర్చ సమాజం మీదికి, వ్యవస్థ తీరుతెన్నుల మీదికి వెడుతుంది. పునాదిలేని అబద్ధాల సృష్టి గురించి అతనే చెబుతాడు. 'ఆకాశదేదర' వెనుక అసలు రహస్యం చెబుతాడు. కారష్ దృక్పథాన్ని, నిర్దాక్షిణ్యమైన వృత్తి చర్యలను తెలుసుకుని సత్యానంద్ షాక్ తింటాడు.

కథాగమనం సూటిగానే ఉన్నది. మార్మికత చుట్టూ వస్తువు పరిభ్రమించినా కథనం స్పష్టంగానే ఉన్నది. ఒకే ఒక సన్నివేశం, కారష్ 'ఆకాశదేవర' పుస్తకాన్ని చదువుతున్నప్పుడే, ఫ్లాష్‌బ్యాక్‌గా ఆ దేవాలయం గురించిన పూర్వాపరాలు రచయిత కథనం చేశారు. ఆ ఫ్లాష్‌బ్యాక్, మిత్రుడితో కారష్ సంభాషణ కలిసి కథ. అయితే, కథలోకి పాఠకుడిని నెమ్మదిగా దింపే క్రమంలో నగ్నముని ఒక ప్రత్యేక కథనశైలిని అనుసరించారు.

కథానాయకుడిని మార్మికత, నిగూఢత కలిగిన పాత్రగా పాఠకుడు అవగాహన చేసుకోవడానికి ఆ శైలి ఉపకరించింది. అతని గురించి ఎవరికీ తెలియదు, తెలిస్తే ఒక్క మిత్రుడు సత్యానంద్‌కు మాత్రమే తెలిసే అవకాశమున్నది-అని పదే పదే చెప్పడం వల్ల సత్యానంద్ పాత్రమీద ఉత్సుకత కలుగుతుంది. చివరకు సత్యానంద్‌కు కూడా తెలిసింది తక్కువేనని తెలుస్తుంది.

మనుషులు దూరని కారడవిలోపల ఒక కొండమీద 'అకాశదేవర' దేవాలయం గురించి చిత్రణ గంభీరంగా ఉంటుంది. అతి పురాతనమైన దేవాలయంగా కనిపించే రెండు గదుల నిర్మాణంలో నిజానికి ఏ దేవతాప్రతిమా ఉండదు. రెండూ రెండు శూన్యమందిరాలు. ఆ రెంటి శూన్యతలను ఒకటి బాహ్యశూన్యత, రెండోది అంతరిక శూన్యత అని రచయిత సూచిస్తాడు. శూన్యంగా ఉన్న గదులే, ఒక చరిత్రకల్పన కారణంగా, ఆ ప్రదేశానికి ఏర్పడిన హంగులూ ప్రచారం కారణంగా-ప్రజలను ఆకర్షిస్తాయి. వాటిని సందర్శించినవారికి ఏరో తాత్వికమైన అనుభూతులను కలిగిస్తాయి. మొదటి గదిదాకా వచ్చిన భక్తులు రెండోగదిలోని మహాశూన్యంలోకి కానుకలను విసిరివేస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు, పెద్ద మొత్తంలో కానుకలు వచ్చేస్థలంగా, పెద్ద వ్యాపార కేంద్రంగా ఆ స్థలం అభివృద్ధి చెందుతుంది. దాని మీద పురాతత్వ పరిశోధకులు కూడా పరిశోధనలు చేస్తారు.

శూన్యం అంటే అస్తిత్వపు రాహిత్యం కాదు. రాహిత్యపు అస్తిత్వం-అన్నాడట గౌతమ బుద్ధుడు. ఇక్కడ నగ్నముని చెప్పిన శూన్యత శంకరుడి మాయావాదానికి ప్రేరణ ఇచ్చిన బౌద్ధశూన్యవాదంలోని శూన్యత కాదు. ఇక్కడి శూన్యం నిజంగా శూన్యమే. వుట్టిడొల్లతనం. అబద్ధానికి వేదిక అయిన డొల్లతనం. మనుషులను తాత్వికతగా భ్రమింపచేసే, ఆధ్యాత్మికతగా అలరింపజేసే ప్రతీకను ఈ కథలో సృష్టించింది మాత్రం విలాస భరితమైన అమానుష జీవితం గడిపే అసత్యాల వ్యాపారి! ఆ వ్యాపారికి వ్యవస్థ లోగుట్టులన్నీ తెలుసు. వ్యవస్థాగత క్రీడను దాని నియమాలతోనే ఆడే ఆటగాడు అతను. తనకీ ఒక విషాదనేపథ్యం వుంటుంది. నిజాయితీకి మూల్యం

చెల్లించిన తండ్రి జ్ఞాపకాలు అతనిలో వ్యవస్థపై కసిని పెంచుతాయి. సంస్కరించే దశ దాటిపోయిన వ్యవస్థను పూర్తిగా కుళ్ళిపోనిస్తేనే, చికిత్స సాధ్యమని అతనికో సిద్ధాంతం కూడా ఉంటుంది. విలన్ నోటివెంటనే వ్యవస్థ రహస్యాలు కక్కిస్తున్న తీరు చూస్తుంటే, రావిశాస్త్రి ధోరణి లీలగా స్ఫురిస్తుంది.

ఇంతకూ ఈ కథాప్రతినాయకుడు ఏమి చేస్తాడు? అతను ఎటువంటి వ్యాపారి? వస్తువులు ఉత్పత్తి చేస్తాడా? మారుబేరాలకు అమ్ముతాడా? డబ్బు నుంచి డబ్బును పుట్టిస్తాడా? కాదు. ఇక్కడే రచయిత అవగాహన పాఠకులకు విశేషంగా అనిపిస్తుంది. కారష్ ఒక కన్సల్టెంట్. కార్పొరేట్ ప్రపంచానికి సలహాలు విక్రయించే నిపుణుడు. పిట్ట నేలమీదో అడవిలోనో రెట్టవేసినప్పుడు ఒక మర్రిచెట్టో చందనపు వృక్షమో మొలవ్వొచ్చు. కానీ, మనిషి మెదడు మీద రెట్టవేసినప్పుడు అది కార్నివోరస్ మానవుణ్ణి సృష్టిస్తుంది. మనుషుల్లో ఈ నరమాంసభక్షకుల్ని గుర్తించడం కష్టం. విషవృక్షాలను మెదళ్ళలో మోసుకుతిరిగే మనుషుల్లో కారష్ ఒకడు.అందుకే అతను కారష్ కాదు, కాపురష్ ఏమో అని సత్యానంద్‌కు అనుమానం వస్తుంది. అతను తన విషమేధను కోట్ల సొమ్ముకు అమ్ముకుంటాడు. వ్యవస్థకు అవసరమైన మార్మిక తాత్వికతలను సృష్టిస్తూ ఉంటాడు. 'ఆకాశదేవర' అతనికి సొమ్ములు సంపాదించేదే కాదు, మనుషుల్ని అలద్దాలకు కట్టివేసి తన వ్యాపారాన్ని సానుకూలం చేసే వ్యవస్థ. ప్రపంచీకరణ యుగంలో ప్రభుత్వాలకు, వ్యాపారులకు వ్యూహరచనలు చేసిపెట్టే కన్సల్టెంట్‌లు వర్తమానాన్నే కాదు, చరిత్రను కూడా రచించగలరు. భవిష్యత్‌కు బాటలు వేయగలరు. వారి చాణక్యం కేవలం మేధాపరమైన వ్యాపారంగా కనిపించవచ్చును కానీ, అందులో తెగే తలలు, పారే నెత్తురూ చాలానే ఉంటుంది. విస్కీ గ్లాసులో ఆవిరిలో ఉడికిన చికెన్‌ముక్క ఉన్నదంటే, కారష్ ఆ రోజు నెత్తురు కళ్లచూశాడన్నమాటే!

వ్యవస్థలోని అసంబద్ధతను, మన సమాజం తీరుతెన్నులు దాని మాయలతో సహా 'ఆకాశదేవర'లో నగ్నముని కథనం చేశారు. కారష్ లాంటి

వాళ్ళు మన చుట్టూ, దేశం చుట్టూ, ప్రపంచమంతటా కోకొల్లలు. సామాజికార్థిక పునాదులను ప్రాతిపదికగా చేసుకుని కథనం చేసే ధోరణి కంటె, ఆ పునాదుల నుంచి పుట్టిన విషపురుగులను, అవలక్షణాలను, వైపరీత్యాలను, నిస్సహాయతలను లక్ష్యంగా పెట్టుకుని కథలు రాయడం నగ్నముని ధోరణి. మనిషి మెదడులో మకాం వేసే విషపురుగులపై ఆయన గురి. ఆకాశదేవరను నిర్మించిన పూజారులూ శిల్పాచార్యులూ సరే, వారంతా కారష్ మనుషులు, పురాతత్వవేత్త అయిన ఈశ్వరశర్మ దాన్నొక చరిత్రగా స్థిరపరుస్తూ పుస్తకం రాయడం–మేధారంగంలోని అమాయకపు డొల్లతనాన్ని తెలియజేస్తుంది. నిజానికి ఆకాశదేవర గుడిలో ఎంత శూన్యమున్నదో, ఈశ్వరశర్మలోనూ అంతే శూన్యమున్నది. కారష్‌లోని చీకటికోణం తెలియని సత్యానంద్‌లోనూ అంతే శూన్యమున్నది.

విలోమకథలు రాసినప్పుడు –"ఈ దేశంలో మనుషులు మనుషులుగా బతకడం లేదని, రాజకీయనాయక జీవిత విశ్వాసాలు విలువలు తలకిందులుగా నడుస్తున్నాయని" నగ్నముని కోపించాడు. ఈ కథ రాసేనాటికి, వ్యవస్థే తలకిందులుగా మారిపోయి, మనుషులు దాన్ని సత్యమని భ్రమించే పరిస్థితి ఏర్పడింది. అందుకే, పాఠకులకు నిగూఢవాతావరణ స్పృహ కల్పించిన కథనంలో, మార్మికతను, ఉత్కంఠను నిర్మించిన భాషాశైలిలో తప్ప రచయిత ఇందులో ప్రయోగశీలత చూపించకపోయినా, కథ విలోమవాస్తవికతనే ప్రతిఫలించింది. ఆకాశదేవర చుట్టూ వున్న మార్మికత, మనం జీవిస్తున్న వ్యవస్థకు మనం అందిస్తున్న ఆమోదమే!

– శ్రీ కె. శ్రీనివాస్

సంపాదకులు, ఆంధ్రజ్యోతి

# అలబ్ధాల సత్యం-నగ్నముని 'ఆకాశదేవర'

సున్నాను కనిపెట్టి, ప్రపంచానికి లెక్కలు నేర్పిన ఈ దేశంలో శూన్యంలో నుంచి డబ్బు ఎలా సంపాదించవచ్చో "మిస్టర్ కారష్" అనబడే కాపురుష్, కాలిక పురుష పాత్ర ద్వారా 'ఆకాశ దేవర'లో నివ్వెరపరిచాడు నగ్నముని.

శూన్యం అంటే ఏమీ లేనితనం. ఈ ఏమీ లేనితనాన్ని గౌతమబుద్ధుడు ప్రవచించినట్లు అస్తిత్వపు రాహిత్యంగా ఎలా మలచవచ్చో 'మిస్టర్ కారష్' అనబడే నెగిటివ్, కార్నివోరస్ పాత్ర 'ఆకాశ దేవర'లో ఆకాశమై ఆవిష్కరించింది. రూపాయి కరెన్సీ నోటు మీద 'ఈ నోటు తెచ్చేవారికి ఒక రూపాయి చెల్లిస్తా"మని వాగ్దానం చేస్తూ రిజర్వ్ బ్యాంకు గవర్నర్ సంతకం ఉంటుంది. అలాంటి నోట్లను వేనవేలను శూన్యం నుండి పుట్టించాలంటే వానికి ఈ సమాజపు ఆర్థిక పోకడ తెలిసి ఉండాలి. మనుషుల మనస్తత్వాలు, క్రూరమైన తర్కం, అంతకంటే క్రూరమైన ఆచరణా తెలిసి ఉండాలి. అన్నింటికీ మించి అడ్డమొచ్చిన ప్రతివాడ్నీ నిర్దాక్షిణ్యంగా తొక్కుకుంటూ పోయే మొరటు పోకడ ఒకటి దానికి ఉండి తీరాలి. వీటన్నింటి ప్రతిరూపమే ఆకాశ దేవరలోని 'మిస్టర్ కారష్'.

డిమాండు, సప్లైల వ్యత్యాస రహస్యాన్ని ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకొని అడుగేసేవాడే ఆర్థిక ప్రపంచపు రారాజు. దేవుడి పేరుతో మార్కెట్ ఎలా సృష్టించవచ్చో, ఆ మార్కెట్‌కు 'బూమ్' ఎలా పెంచవచ్చో, దానికి 'స్లంప్' (ఆర్థిక దుస్థితి) అన్నది లేనేలేదు అనే రహస్యాన్ని కూడా ఎరిగినవాడు 'మిస్టర్ కారష్'. ఈ వ్యాపారానికి పోటీ లేదు. మిస్టర్ కారష్ వంటి వ్యక్తులకు అదేమంత పెద్ద విషయమూ కాదు.

రెండు వర్గాల మధ్యనో లేదా రెండు కంపెనీల మధ్యనో రాయబారం మిస్టర్ కారష్ జోక్యంతో ముగిసిన రోజున గ్లాసులు ఘల్లుమంటాయి. ప్రతి వ్యాపారానికీ ముడి సరుకులున్నట్లుగానే ఈయన వ్యాపారానికీ ఒక ముడి సరుకు ఉంది. దాని పేరు 'అబద్ధం'. ఒకప్పుడు ఉనికిలో ఉన్న నిజాన్ని ఇప్పుడు అబద్ధంగా, లేదా అబద్ధాన్ని నిజం చేయడమనే దశను దాటి నిజంతో సంబంధం లేకుండానే అబద్ధాన్ని సృష్టించి, ఆ స్వయంభువునే అసలు సిసలు నిజంగా జనం రక్తంలోకి ఎక్కించే కొత్త కళను ఔపోసన పట్టినవాడు. 'మాన్యుఫాక్చరింగ్, కన్సెంట్' కళలో ఆరితేరినవాడు. మనుషులు మహా శూన్యగర్భంలోకి డబ్బులు విసరటం, ఆ డబ్బులు ఒక నెట్‌వర్క్ ద్వారా మిస్టర్ కారష్‌కు చేరడమూ, ఆ శూన్యగర్భం ఆకాశ దేవర చుట్టూ ఒక వ్యాపార వలయం సృష్టించడమూ అంతా ఒక మహా మాయ, శూన్య యోగం, ద్రవ్య సృష్టి. ఈ సూపర్ నెట్‌వర్క్‌కు బీజం వేసిన తీరు కథంతా పూర్తయ్యాక కానీ తేటతెల్లం కాదు. ఈ 'సుప్రాటెక్నో నెట్‌వర్క్' సృష్టించడం, మార్కెట్ మాయలో ఆరితేరినవారు తరచూ ఈ ఫీట్లు చేస్తూండటం మనం గమనిస్తున్నదే. కథాశైలితో నగ్నముని ఆ తీరుని బొమ్మ కట్టించిన వైనం బాగుంది.

ఉదాహరణకి ఒక యజమాని దగ్గర పనిచేసే ఒక నౌకరు అతని వాచీని కొట్టేశాడు. దాన్ని చాలా ఖరీదుకు అమ్మాడు. ఆ వాచీ కోసమే అతను దొంగ అయ్యాడు. దానికోసమే అతను నమ్మకద్రోహి అయ్యాడు. దాని కోసమే అతను అన్నీ అయ్యాడు. అయితేనేం అందువల్లనే కదా అతనికి కావలసినంత డబ్బు వచ్చింది లేదా కావల్సినంత డబ్బొస్తుంది కాబట్టి అతనలా చేశాడు. ఏదో విధంగా డబ్బయితే వచ్చింది కదా. ఇదే అతని తత్వం, నేటి ప్రపంచ తత్వమూ అలాగే ఈ తత్వాన్ని ఒంటబట్టించుకున్న నేటి ప్రపంచం ఒక నీతిబాహ్యమైన అబద్ధపు కాల్పనిక వర్తులంలో గిరికీలు కొడ్తుంది. ఈ రోజు పాతకాలపు విలువలతో కూడిన 'హీరో' లేదు. అందరూ ప్రతినాయకులే. ప్రతి నాయకత్వంలో తనకంటూ ఒక శైలినేర్పరచుకొని ఎంత ఎక్కువగా,

ఎంత నిర్లజ్జగా, ఎంత క్రూరంగా దోపిడీ (తప్పు...దాన్ని సంపాదన అనాలేమో!) చేయగలిగితే వాడే నాయకుడు. వాడే అసలు సిసలు హీరో.

మిస్టర్ కారష్ కూడా అట్లాంటి హీరోయే. మిస్టర్ కారష్ ఒక 'గట్టర్ బోయ్', ఒక 'స్లమ్ డాగ్', ఒక క్రూరుడు. మిస్టర్ కారష్ ఒక నీతిబాహ్య అవినీతి వ్యాపారి. అంతెందుకు, మిస్టర్ కారష్ ఒక 'కార్నివోరస్' మాంసభక్షకుడు. అది నరమాంసమైననా సరే. పదేళ్ళకే అనాథ. న్యూస్ పేపర్ వేయడం, వాల్‌పోస్టర్లు అంటించడం దగ్గర్నుంచి అన్ని పనులూ చేస్తూ పేవ్‌మెంట్ మీద బతికాడు.

అయితే మిస్టర్ కారష్ ఒక ఆశాజీవి. ఒక సంక్లిష్ట వ్యక్తి. అతనికి ఈ సమాజ దైన్యంపట్ల స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. స్త్రీ పురుషుల మధ్య ప్రేమా, సెక్స్ దగ్గర్నుంచి ఈ దేశంలో జరిగే ఎన్నికలు, అవినీతి, ప్రజాప్రతినిధుల ఆడంగితనం, పరిపాలనలోని అరాచకత్వం...ఒకటేమిటి, "ఈ సమాజమనబడేది ప్రజాస్వామ్య కసాయి వెంట నడిచే గొర్రె" అంటాడు. "సంక్షేమానికో కసాయి భాష" ఉందంటాడు. నిజానికి అతను అట్లా మాట్లాడుతున్నపుడు అతనిలో మనకు ఒక విలన్ కాక హీరో కనబడతాడు.

నగ్నముని విలోమ కథలు రాసి 35 ఏళ్లు దాటింది. ఆనాడు సమాజం విలోమ గమనంలో ఎలా నడుస్తోందో చెప్పాడు. ఈ 35 ఏళ్ళ తరువాత కూడా తన గమనాన్ని మార్చుకోకుండానే ఇంకా, ఇంకా దిగజారుతోన్న వైనాన్ని తనదైన శైలిలో అధిక్షేపించాడు.

నేడు ఉదయం వార్తా పత్రికలు తెరవగానే కనబడే మిస్టర్ కారష్‌లు కోకొల్లలు. ఒక నీరా రాడియా కావచ్చు. ఒక మంత్రి కావచ్చు, ఒక పొలిటికల్ బ్రోకర్ కావచ్చు. ఎవరైనా సరే వారు అబద్ధాలను అమ్ముతుంటారు. కోట్లకు పడగలెత్తుతారు. ఒక్కో అబద్ధం విలువ కోటి నుండి పది కోట్ల దాకా ఉండొచ్చు. ఈ అబద్ధాలను అమ్మడానికి వారికి విలువలేం ఉండవు. అన్నిటినీ వినియోగించుకుంటారు. "నిజాన్ని పాతిపెట్టి ఆ సమాధిపై నిలబడి ప్రచార

యంత్రం మాట్లాడుతుంది" అంటాడు మిస్టర్ కారష్, అంతేకాక, ప్రచారయంత్రం కక్ష్యకు వెలుపల ఉండేవారి సంఖ్య బహు తక్కువ అనే సత్యాన్ని గ్రహించినవాడు. అబద్ధాలతో లేని చరిత్రను జరిగినట్లు సృష్టించే కాల్పనిక యంత్రాలెన్నో. నేడు డబ్బుతో డబ్బును కొనే దశను దాటి, ప్రచారంతో డబ్బు చేయలేని పనులెన్నో చేయగలననే సత్యాన్ని గ్రహించినవాడు మిస్టర్ కారష్. ఈ మధ్య ఒక సినిమాలో, దేవాలయంలో అడుక్కునే ఒక పాత్ర 'ఇన్ఫర్మేషన్ ఈజ్ వెల్త్' అంటుంది. ఇన్ఫర్మేషన్‌ను అబద్ధాలతో నింపితే డబ్బే డబ్బు.

దేవుళ్ళకు కొరువలేని ఈ దేశంలో దేవుణ్ణి సరుకుగా చేసుకొని లెక్కకి మిక్కిలి కారష్‌లు ఎలా సంపాదిస్తున్నారో నిత్యానుభవమే. ఒకడు దేవుని పేరు చెప్పి భూమి కొట్టేస్తాడు. ఇంకొకడు నేనే కలియుగ దేవుణ్నంటూ బంగారు దేవాలయం నిర్మించుకుంటాడు. ధనమూలం మిదం జగత్, జగన్మూలమిదం ధనం. మహా శూన్య గర్భం నగ్నముని సృష్టించిన ఒక సింబాలిక్ సెటైర్. నదుల్లోకి, కాలువల్లోకి డబ్బులు విసిరే జనం, దేవుడి పేరు చెబితే శూన్యంలోకి విసరలేరా?

నగ్నముని రాసిన ఈ 'ఆకాశ దేవర' సాహిత్య రూపమేదో నాకు తెలియదు. ఇది కథో, నవలికో, పెద్ద కథో ఏదైనా కావచ్చు. సైజు కొలమానం కాదు. మిస్టర్ కారష్ అనే ఒక 'నైవ్ నేరేటర్'తో కథను నడిపిన తీరు చాలా బాగుంది. అబద్ధపు పునాదుల మీద కట్టిన పాశ్చాత్య ఆర్థిక ప్రపంచం కుప్పకూలిన తీరును కళ్ళారా వీక్షించాము. లేని ఆర్థిక స్థాయిని అబద్ధంగా చెప్పి, నిచ్చెనెక్కబోయి బొక్కబోర్లా పడ్డ రామలింగరాజును చూశాము. అబద్ధాల ప్రపంచం నిలవదనే 'సత్యా'న్ని గమనించినా నగ్నముని 'ఆకాశ దేవర'ను సశేషంగానే ఉంచాడెందుకనో.

'ది గ్రేప్స్ ఆఫ్ రాత్'కు ముందుమాట రాస్తూ రాబర్ట్ డిమాట్ ఆ నవల గురించి ఇలా అంటారు– "The Grapes of Wrath has a home

grown quality, part naturalistic epic; part jeremiad; part captivity narrative; part road novel; part transcendal gospel".ఈ లక్షణాలు 'ఆకాశ దేవర'కు కూడా ఉన్నాయనుకుంటాను. ఏ సాహిత్యమైనా ఆనాటి కాల పరిస్థితులను ప్రతిబింబించకపోతే, మానవ మెదడులో గూడుకట్టుకున్న శూన్యాన్ని రూపుకట్టడంలో విఫలమైతే అది సాహిత్యం కానే కాదు. కేవలం కాలక్షేపపు కాల్పనికం మాత్రమే. మొత్తంగా 'ఆకాశ దేవర' ఒక 'Structural Irony' ఒక 'Political Allegory'.

-శ్రీ వై.వేణుగోపాల్ రెడ్డి

న్యాయవాది, ఆం.ప్ర. హైకోర్టు

# సామాజిక విపర్యయాల సంగ్రహం
# నగ్నముని విలోమ కథ 'ఆకాశదేవర'

ఒకప్పుడు చలం శ్రీశ్రీతో 'ఇప్పుడు రాస్తున్న కొత్తదనాలకే ప్రజలు ఇంకా అలవాటు కాలేదే, ఇంకా ఈ సర్రియలిజం తెస్తే అసలు గాభరాపడి చదవడమే మానేస్తారేమో' అన్నారట. ఇద్దరూ సాహిత్య సత్యాన్నీ, సమాజ తత్వాన్నీ తెలుసుకున్న వారే! అన్ని సందేహాల్ని పక్కనబెట్టి సాహితీలోకానికి కొత్తదనాన్ని చవిచూపిన వారే! సంఘానికి సాధారణంగా కొత్తదనం ఆహ్వానసీయమే. ఎక్కడ? ఆహార వ్యవహారాల్లోనూ, విహారాల్లోనూ ఆహార్యాల్లోనూ-ఫ్యాషన్లు అంటామే-అక్కడ! సాహిత్యంలో కొత్తదనాన్ని చవిచూడటానికి కొంత ఉలికిపాటు కొంత బెరుకుదనం, కొంత గుంభన, కొంత భయం వుంటాయి. కొంత మందికి ఆ కొత్తదనాన్ని ఆహ్వానించటమే అపరాధమనే భావనా వుండవచ్చు. అయినా, ధీరులు కొత్తదనాన్ని అందించకుండా వుండరు. ఆ ధీరులకు సాహిత్యప్రయోజనంపట్ల, ప్రయోగం పట్ల నిబద్ధత ఎక్కువ. సమాజాన్ని, సమాజంలోని మనుషుల్ని -సాహిత్యం ఎప్పుడూ ఒక 'మిర్రరింగ్ ఎక్సర్‌సైజ్'కు గురిచేస్తూనే వుండాలనేది ఆ నిబద్ధత. అందువలన పరిణామ ప్రక్రియ సాగుతున్నంత కాలం, వారు ఆ పరిణామ ప్రతిఫలనాల్నీ, పర్యవసానాల్నీ తమ సాహిత్యంలో ప్రోది చేసి చదువరుల ముందుంచుతూ వుంటారు. ఇలాంటి నిబద్ధత కలిగిన కవుల్లో, రచయితల్లో, సామాజిక తత్వవేత్తల్లో అగ్రశ్రేణివారు నగ్నముని.

నగ్నముని జగమెరిగిన సాహితీపరుడు.. ఆయన జగాన్నెరిగిన సామాజిక శాస్త్రవేత్త. అనేక యుద్ధాల్లో ఆరితేరిన రచనా సాహసికుడు.

చాలా సాహిత్యోద్యమాల నిర్మాణానికి ప్రణాళికా రచయితల్లో ముఖ్యుడు-Brain behind the plan and process. ప్రతిభావ్యుత్పత్తి బహుముఖీనంగా ప్రక్రియశాఖాకృతమైనధీమంతుడు. నగ్నముని ఎంతగా అధ్యయనశీలో అంతగా ప్రయోగశీలి. ఆయన ప్రయోగశీల ప్రతిఫలనాల్లో ఒక విలక్షణమైన, విశిష్టమైన సాఫల్యరూపం విలోమకథ. కథకుడుగా ఇది ఆయన Brand name.

1977లోని 'లైకామజ్నూ' నుంచి సిమెంటు సంతతి' వంటి చాలా గొప్ప కథలు రాశాడు నగ్నముని. తానే చెప్పినట్లు ఆయన విలోమ కథల్లో-'అధివాస్తవికత వుంది, అదృశ్య వాస్తవికత' వుంది. సమాజంలోని మనుషుల చర్యలూ, ప్రవర్తనా కనబడతాయిగానీ, వాటి వెనుక వుండే శాసనశక్తుల స్వరూప స్వభావాలూ, వాటి ప్రభావాలూ మాటయేమిటి? అవి స్పష్టంగా తెరమీదకి రావు. ఆ బొమ్మల్ని ప్రజలెరుగరు. వాటిని స్పష్టాస్పష్టంగానైనా దృశ్యమానం చేస్తుంది విలోమకథ.

మౌలికంగా విలోమకథ-వ్యర్తమాన వ్యవస్థపట్ల, 'ఆ వ్యవస్థా బంధితుడైన మనిషిపట్ల-అధిక్షేపపు స్వరం, నిరసనగళం, తిరస్కారపు ఉధృతీ అంతర్లయంగా సాగుతుంది. వ్యవస్థని తన గుప్పిట్లో పెట్టుకుని ఆడిస్తున్న రాజ్యాధికారం యొక్క వికృతరూపాన్ని రాజకీయేతర శక్తుల బలప్రదర్శనా రీతినీ-బహిర్గతం చేస్తుంది విలోమకథ. విలోమకథ తప్పనిసరిగా-మనుషుల్లోని ఆంతరంగిక, బాహ్య వ్యక్తిత్వం మీద వ్యవస్థలోని రాజకీయ ప్రమేయానికి ప్రక్రియాగతంగా, కళారూపాన్ని సృష్టించి మనముందుంచుతుంది. తాలూ తప్పనీ, తుక్కూదూగరనీ విడదీసి పడేసే 'జల్లెడ' అది. ఈ ప్రాసెస్‌లో విలోమకథ చదువరి మేధలో శతకోటి ఆలోచనలు రగిల్చి బుర్రని గిరికీలు కొట్టిస్తుంది. అనంతకోటి అలజడుల్ని రేపి అతలాకుతలం చేస్తుంది.

రాజకీయ స్ఫూర్తితో తెలుగు కథా సాహిత్యంలోనూ చాలా రచనలు వచ్చాయి, వస్తున్నాయి. వ్యవస్థ పళ్ల చక్రంలో ఇరుక్కుని నుజ్జునుజ్జవుతున్న

మనిషి సంఘర్షణని ఆవిష్కరిస్తూ అన్ని ప్రాంతాల నుంచీ గొప్ప కథలు వచ్చాయి. వాటన్నిటా సమాజంలోని వికృత పరిస్థితి చిత్రణ వుంటుంది. ఈ పరిస్థితికి చదువరిలో సంవేదనని కలిగిస్తాయి ఆ రచనలు. అయితే, విలోమ కథ ఈ రెండు పనులూ చేస్తూనే వాంఛనీయమైన మార్పుపట్ల మనుషుల్లోని ఉదాసీనతనీ, ఆచరణలోని జడత్వాన్నీ అధిక్షేపిస్తుంది. అన్నిటా, అందరిలోనూ నెలకొనివున్న passivity మోహాన్న చన్నీళ్లలా కొడుతుంది. అంటే, ఈ దుస్థితి ఇలా వుంది సరే, 'నీ సంగతేమిటి?' అనే నిష్ఠురమైన ప్రశ్ననీ నిష్కర్షగా చదువరి ముందు పెట్టి నిలవేస్తుంది. చదువరిలో రాజ్యంపట్ల, రాజ్యప్రమేయం పట్ల చిరాకునీ, చీదరనీ, వెగటునీ, అసహ్యాన్నీ కలిగించి, మనిషి స్వార్థంతో, స్వప్రయోజనంతో సంఘాన్ని ఎలా దగా చేయగలదో చూపించి, దానికి కారణాల్ని విశ్లేషించి చదువరి ముందుంచుతుంది. చివరికి, ఇంతటి దుస్థితి-మనిషి అభ్యున్నతినీ, సాంఘిక అభ్యుదయాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా- నువ్వూ నేనూ-సాగనీయకూడదనే ఆకాంక్షని బలంగా ధ్వనిమంతం చేస్తుంది.

నగ్నముని విలోమకథల్లో ఈనాటి కథ 'ఆకాశదేవర'. కొంచెం పెద్దది. వార్త ఆదివారం అనుబంధంలో రెండు వారాలు వచ్చింది.

'ఆకాశదేవర' కూడా స్వభావరీత్యా అధిక్షేపాత్మకరచన. విలోమకథగా పైన వివరించిన లక్ష్య లక్షణాల్ని స్థూలంగా పొందుపరచుకున్న మంచి రచన. వర్తమాన సామాజిక వాస్తవికతని చాలా పారదర్శకంగా చూపుతూ, రచయిత మేధోమథనంతో జనించిన విశ్లేషణనీ, వ్యాఖ్యానాన్నీ-కథాత్మకతతో సమన్వయపరచుకున్న సాహిత్యరూపం-ఈ 'ఆకాశదేవర'!

స్థూలంగా 'ఆకాశదేవర'లోని కథని ప్రస్తావిస్తాను.

మిస్టర్ కారష్ మూడు పదుల వయసు నిండని ఆధునిక వాణిజ్య వండర్. చాలా చాలా చాలా ఖరీదైన మనిషి. ఆ స్థాయిని వివరంగా చెబుతుంది కథ. ఇంటర్నేషనల్ పర్సనాలిటీ. కారష్‌కి యువ ఆర్యాలజిస్ట్ ఈశ్వర్ శర్మ 'ఆకాశదేవర' గ్రంథం రాసి చదవమని ఇస్తాడు. దాన్ని చదివి

వివరంగా తన మిత్రుడూ, తన చాలా రహస్యాలు తెలిసిన ఆప్తుడూ అయిన సత్యానంద్‌కి 'ఆకాశదేవర' ఏమిటో చెప్తాడు కారష్. 'ఆకాశదేవర' అనేది కొండమీద ఒక అద్భుత నిర్మాణం, గుడి! దానిలో రెండు గదులు. మొదటి గది భౌతికశూన్యానికి చెందింది. రెండవ గది అధిభౌతిక శూన్యానికి చెందింది. రెండూ శూన్య కక్ష్యలే! గదుల్లో నిశ్శబ్దం పాటించాలి. మహాశూన్య గర్భంలోకి నాణేలూ, నోట్లూ విసిరి, నమస్కరించి బయటకు రావాలి. అతిచిన్న ఆకర్షణీయమైన చోటుగా మొదలై., పట్టరానంత అభ్యుదయానికి ఎదిగింది గుడి! జనమే జనం. ప్రచారమే ప్రచారం. డబ్బే డబ్బు...కోట్లు కోట్లు...! చివరికి కారష్ అసలు రహస్యాన్ని సత్యానంద్‌కి చెబుతాడు. 'ఆకాశదేవర' పెద్ద అబద్ధం. అబద్ధంతో ప్రారంభమై, అబద్ధంతో మనుషుల్ని అల్లుకుని, అబద్ధంతోనే సమాజాన్నంతా ఆక్రమించిన ఒక పటిష్టమైన నిర్మాణం. రెండవ శూన్యం గదిలో పదేకోట్లారి సంపద అంతా తనకు చెందుతోంది! ఈ పొడవైన గొలుసులో ఎన్నెన్నో లింకులు. అందర్నీ, అన్నింటినీ మేనేజ్ చేయటంలో కారష్ దిట్ట! ఆ 'సుప్రాటెక్స్‌నెట్‌వర్క్'తో అసలు వ్యక్తి కనబడకుండా అదృశ్యంగా ఎన్నో పనులు సాధించుకోవచ్చు., అదొక 'ఇన్విజిబుల్ సర్కిల్'! ఇదీ కారష్! అతనంటాడు, 'నేను ప్రచారయుగానికి చెందిన కారష్‌ని. ఈ కుహనా వ్యవస్థల్లోంచి వచ్చిన కాలిక కాపురుషుణ్ణి. వజ్రాన్ని వజ్రంతోనే కోసినట్లుగానే, ముల్లును ముల్లుతో తీసినట్లుగానే, అబద్ధాన్ని అబద్ధంతో ఎదుర్కొంటాను' అని!

'ఆకాశదేవర' కథ ఎత్తుగడ ఎంతో ఉత్సాహజనకంగా మొదలైంది.

'ఓ పిట్ట రెట్ట వేసింది. నిటారుగా నేలపై బడింది. మన్నును ఆశ్రయం కోరింది. వానచినుకు దాన్ని వెంబడించి కౌగిలించుకుంది. రెండూ పరవశత్వంలో ఒక్కటై మర్రిచెట్టుగా మారింది. నలుగురికీ నీడ నిచ్చింది....హఠాత్తుగా జబర్దస్తీగా మొత్తం వాతావరణం ఓ రాజకీయ నాయకుడి ఆక్రమణలోకి వెళ్ళింది. ఏదో సొంత ప్రాజెక్టుకి అడ్డంగా వున్నదని మర్రిచెట్టు అడ్డంగా నరికి వేయబడింది.

ఇలా మరో మూడు పేరాల్లో పిట్ట రెట్టవేసింది! ఎఱ్ఱచందనం స్మగ్లింగ్, గంజాయి విజృంభణం, మనిషి మెదడులో 'కార్నివోరస్' మొక్క మొలవడం...వస్తాయి. ఈ కార్నివోరస్ మాంసాహారి, నరమాంసం యిష్టం. దారినబోయే వారిని ఆకర్షించి, ముద్దజేసి భక్షిస్తుంది. హాయిగా, సులువుగా జీర్ణం చేసుకుంటుంది. 'మనుషుల్లో కార్నివోరస్ మనుషుల్ని పోల్చుకోవడం కష్టం' అని ముగుస్తుంది ఎత్తుగడ. అదొక ఖండిక, మనిషి స్వార్థం, స్వప్రయోజనం, సంఘంలోని అస్తవ్యస్తత, అవాంఛనీయత వ్యాప్తిని సూచిస్తూ ప్రతీకాత్మకమైన ప్రారంభాన్నిచ్చారు రచయిత-ఈ ఖండిక ద్వారా కార్నివోరస్ ఆవిష్కారం 'ఆకాశదేవర'కు ముందుమాటలాంటిది. కథలోని ముఖ్యపాత్ర-కారష్ ఈ కార్నివోరస్ మనుషుల జాతికి చెందినవాడని-కథ ముగింపుని సమన్వయించుకుంటే అర్థమవుతుంది.

అసలు 'ఆకాశదేవర' కథానిర్మాణ పద్ధతిలో ఒక వినూత్న శిల్పాన్ని ఆవిష్కరించారు రచయిత. ఇది సంక్లిష్ట శిల్ప విశేషం. ఎత్తుగడ కాగానే కారష్ ఎవరు, ఏమిటి అనేది చెప్పుకొస్తారు రచయిత. 34 పేజీల కథలో ఏడు పేజీలయ్యాయి. ఈశ్వరశర్మ అనే ఆర్కియాలిజిస్ట్ తాను రాసిన ఆకాశదేవర గ్రంథాన్ని కారష్‌కి యిచ్చాడు. కారష్ దాన్ని చదివాడు. ఈ చదివిన కథ చరిత్ర అంతా ఒక అధ్యాయంగా వస్తుంది. గతంలోనూ, వర్తమానంలోనూ ఆ గుడి వ్యవహారం భాగోతం మొత్తం-భౌతిక వాస్తవ దర్శనం చేయించారు నగ్నముని ఈ అధ్యాయంలో. ఇప్పటికి 18 పేజీలు నడిచింది గాథ. 'ఆకాశదేవర' గ్రంథపఠనం తర్వాత సత్యానంద్‌ని పిలిపించాడు కారష్. ఈ సత్యానంద్ అతనికి ఆత్మీయమిత్రుడు. అతనికి సుదీర్ఘ ఉపన్యాసం యిస్తాడు. ఇక్కడ ఈనాటి రాజకీయ సామాజిక చట్రంలో-బాహిరంగా, ఆంతరంగికంగా మనిషి ఎవరో, ఏమిటో, ఏమైపోతున్నాడో అతి విస్తారంగా చెప్పుకుపోతాడు. అందునా ఏకపక్షంగా, విశ్లేషణాత్మకంగా వివరణాత్మకంగా మనసు విప్పుకుంటాడు కారష్. రచయిత వ్యాఖ్యరూపంలో ఒక విధ్వంసదృశ్య చిత్రణం జరిగింది. పెళ్లి-సంసారం,

మనిషి కల్పించుకునే రక్షణ వలయం, మధ్య తరగతి చదువులూ చట్టుబండలూ, ఉద్యోగం, అవినీతి, ఎన్నికలు, ప్రజాస్వామ్యం చేస్తున్న పరిహాసం, సమాజమనే విచిత్ర పదార్థం, రాజకీయ రాక్షసం ముందు నీతినిష్ఠనిలబడలేని దుస్థితి, చివరికి అబద్ధం ప్రాబల్యం ప్రచారం దోపిడీ ఇలా అనేక అంశాలు చర్చకొస్తాయి. ఈ అంశాలన్నింటినీ కొంత అనుసంధానం చేస్తూ కారప్ తనసొంత గత చరిత్రనీ చెప్పుకుంటాడు.

ముగింపులో ముడి విడిపడుతుంది. 'ఆకాశదేవర' అనేది ఎలాంటి ఇసుక వంతెనో, ఎలాంటి అబద్ధాల పుట్టో, 'ఆకాశదేవర' ద్వారా జరుగుతున్న వ్యాపార వ్యవహారం అంతా పొరలు పొరలుగా విడివడుతూ ప్రత్యక్షమవుతుంది.

ప్రాథమికంగా 'ఆకాశదేవర' ప్రజాస్వామ్యరీతిలో ప్రజల్లోని మూఢవిశ్వాసాల్నీ, గుడ్డి నమ్మకాల్నీ ఆధారం చేసుకుని ఎంతగా స్వప్రయోజనాన్ని కాపాడుకోవచ్చునో చూపుతుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో మార్కెట్ మాయాజాలంలో ప్రచార బుకాయింపుతో, అబద్ధపు ఆకర్షణతో మనుషుల్ని ఎంత తేలిగ్గా వినిమయవస్తువుల్ని చేయవచ్చో చెబుతోంది. మనిషి భావననీ, భావస్పందనల్నీ కూడా ఎంత దారుణంగా ఆ 'గేమ్'లోకి లాగవచ్చునో చెబుతోంది.

ఒక ఊహనీ, ఒక స్వప్నాన్ని, ఒక అవాస్తవికతని, ఒక భావనని, ఒక మానసిక ఆశనీ, శాంతినీ, ఘోరమైన శూన్యాన్ని కూడా నైరాశ్యంగా 'విక్రయ' ప్రక్రియలోకి చేర్చి, ఎంత దారుణంగా, వన్నాగంతో, హీనంగా, తేలిగ్గా-సమాజాన్నీ, మనుషుల్నీ మోసగించవచ్చో, దోపిడీ సాగించవచ్చో ఆవిష్కరించింది 'ఆకాశదేవర'. మనం రోజూ చూస్తున్న మన కళ్ల ముందు నిరాఘాటంగా సాగిపోతున్న తుచ్ఛమైన దోపిడీ వ్యవస్థయొక్క ఒక పార్శ్వాన్ని ఒక Ugly రూపాన్ని కుంభాకార దర్పణంలో చూపేరు నగ్నముని. గాలి పోగేస్తే కూడా నోట్లు రాలతాయనే నిష్ఠుర సత్యాన్ని శక్తివంతంగా మనముందుంచింది 'ఆకాశదేవర'.

విలోమకథగా 'ఆకాశదేవర' మనిషిలోని విధ్వంసాన్ని మాత్రమేగాక, సమాజం మొత్తానికి పట్టిన విలువల రాహిత్యం అనే వేరుపురుగురూపాన్నీ చిత్రించింది. వ్యక్తి బలహీనతనీ, పరపీడనకి అతని అనవరత సంసిద్ధతనీ కూడా అద్భుతంగా ఆవిష్కరించింది. ఇదీ ఆలోచనా ప్రేరకమైన దయనీయస్థితి.

విలోమకథగా 'ఆకాశదేవర'-ఒక పక్క సమాజాన్నీ మనిషినీ-చలన శీలశక్తులుగా వాస్తవికంగా చూపుతూనే ఆ శక్తుల్ని గమనిస్తున్న వ్యక్తుల ఉదాసీనతపట్ల ఏహ్యతని అంతర్ధ్వనిగా వినిపిస్తోంది. దాన్ని పసిగట్టి, అంతర్ముఖీనుడై ఆచరణాత్మకంగా ముందుకుసాగాలి చదువరి-అనే సందేశాన్ని చెప్పకయే చెబుతోంది.

'ఆకాశదేవర'-ఒక బతుకు సాక్ష్యం. అనేకాకేక బతుకుల విషాదం. అందుకనే అది ఒక విశేషమైన సాహిత్య సృష్టి!.

-విహారి

కవి, కథకులు, విశ్లేషకులు

# నగ్నముని గురించి రేఖామాత్రంగా
# కొన్ని వివరాలు

| | | |
|---|---|---|
| అసలు పేరు | - | మానేపల్లి హృషీ కేశవరావు |
| బంధువులకి, చిన్ననాటి మిత్రులకి | - | హృషీ |
| సాహిత్యంలో | - | నగ్నముని |
| అమ్మ, నాన్న | - | మానేపల్లి సంగమేశ్వరకవి, లక్ష్మీకాంతమ్మ |
| జననం | - | 15-5-1940 : తెనాలిలో |
| బాల్యం | - | మచిలీపట్నం (బందరు) |
| చదువు | - | హైదరాబాదులో బి.ఎ., సాంకేతిక విద్యలు |
| ఉద్యోగం | - | పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో ఎంపిక. ఆం.ప్ర. శాసనసభలో వెర్బాటిమ్ రిపోర్టర్‌గా 1958లో నియామకం. తరువాత చీఫ్ రిపోర్టర్‌గా, అసిస్టెంట్ సెక్రటరీగా, డిప్యూటీ సెక్రటరీగా, జాయింట్ సెక్రటరీగా పదవుల నిర్వహణ. 1998లో పదవీ విరమణ చేశారు. |

సమాంతర ఉద్యమ విలువల ప్రయాణంలో రచించిన...

కవితలు, కథలు, నాటక నాటకీకరణలు, ఆకాశవాణి ప్రసారాలు, ఇంటర్వ్యూలు, సినిమా మూలకథలు, వారం వారం, నెలనెలా వెలువరించిన విశ్లేషణా రచనలు, ముఖ్యంగా ప్రారంభించిన, కొనసాగించిన సాహితీ ఉద్యమాలు.

- మొదటి కవిత-'సౌందర్యపు స్వగతం' 1957 నవంబరు, 'తెలుగు స్వతంత్ర'లో ప్రచురణ
- మొదటి కవితా సంపుటి-'ఉదయించని ఉదయాలు'-1962లో వెలువడింది.
- రెండవ కవితా సంపుటి-'తూర్పు గాలి' 1972లో.
- మొదటి కథల సంపుటి-'నగ్నముని కథలు' (16) 1973లో వెలువడింది.
- రెండవ కథల సంపుటి-'విలోమ కథలు' (6) రచన, వివిధ పత్రికలలో ప్రచురణ ప్రారంభం ఎమర్జెన్సీ కాలంలో. 1979లో మొదటగా సంపుటిగా వెలువడింది. ఇవి ఎమర్జెన్సీ ఎక్కుపెట్టిన కథలు. విలువలు విలోమమ వుతున్నాయని తెలిపే ఆధిక్షేప, ప్రయోగాత్మక, నూత్నశైలీ పరిచయ కథలు.
- పత్రికలలో-ప్రచురింపబడి, పుస్తక రూపంలోకి రాని మరిన్ని కథలు.
- ఆకాశవాణిలో-1959లో స్వీయవాణి ప్రారంభమైంది. ఇతర భాషల నుంచి కవితలు అసంఖ్యాకంగా అనువదించడం జరిగింది. స్వీయ

రచనలు - కవితలు, కథలు, వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేశారు. శ్రవ్య నాటిక నాటకాల్లో పాల్గొన్నారు. 'ఎ' గ్రేడ్ ఆర్టిస్టుగా వర్గీకరింపబడ్డారు.

- ఉత్తమ నటుడిగా 1960 దశకం మొదట్లో, ఆం.ప్ర. సచివాలయం అంతర్‌శాఖా నాటిక, నాటకాల పోటీలో 'చతురంగ' నాటికలో ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు.
- దృశ్యంగా నాటకీకరణ-1974లో, మొదటిసారి, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' బృహన్నవలను ప్రదర్శన నిమిత్తం నాటకీకరణ చేశారు. 109 ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. 'నిత్య నాటకం ఒక ఉద్యమం'లా కొనసాగాలనే భావనకు ఉదాహరణగా నిలిచింది.
- శ్రవ్య నాటకీకరణ-1975లో, ఆకాశవాణిలో ప్రసారం నిమిత్తం ఉన్నవ వారి 'మాలపల్లి' నవలను తిరిగి శ్రవ్య నాటకంగా రచించడం జరిగింది.
- స్వీయ నాటకం-'ఇక్కడ కలలు అమ్మబడును'. పూర్తి నాటకం రచించారు. థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించారు.
- సినిమాలకు-'మరోచరిత్ర', 'ఎం.ఎల్.ఎ. ఏడుకొండలు', 'త్రిశూలం', 'ఉదయం' మొదలైన సినిమాలకు మూలకథలను రచించారు.
- వారం వారం-'ఉదయం' దినపత్రికలో

'అక్షరాయుధం' శీర్షికతో, 'ఆంధ్రప్రభ'దినపత్రికలో 'చేదుమాట', 'నగ్ననేత్రం' మొదలైన శీర్షికలతో లఘు వ్యాసాలు రాశారు.

- నెలనెలా-'నడుస్తున్న చరిత్ర' మాసపత్రికలో 'వ్యవస్థ-మరోకోణం' శీర్షికతో- ప్రధానంగా సామాజిక, రాజకీయ అంశాలు విశ్లేషించారు. 'చినుకు' మాసపత్రికలో 'నగ్నవీక్షణం' శీర్షికతో సాహితీ అంశాలు రచించారు.
- **అరెస్టు**: 1975 ఏప్రిల్‌లో జరిగిన 'ప్రపంచ తెలుగు మహాసభలు' సమయంలో, ప్రజాకవులు, రచయితలపై ప్రభుత్వ అణచివేత ధోరణిపై నిరసన తెలిపిన వారిని అరెస్టు చేశారు. ఇతర సాహితీవేత్తల వత్తిడితో 38 గంటల తర్వాత విడుదల చేశారు.
- **నిఘా** : 1975 జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించబడింది. వీరి రచనలపై ఉపన్యాసాలపై, కదలికలపై నిఘా మరింత ఎక్కువ చేశారు.
- **ఉద్యోగం నుండి తొలగింపు**: 1975 డిసెంబరు 22వ తేదీన ఉద్యోగం నుండి డిస్మిస్ చేశారు.
- **తిరిగి నియామకం**: లోక్‌సభకు తిరిగి ఎన్నికలు జరిగి, కేంద్రంలో జనతా ప్రభుత్వం ఏర్పడ్డాక, 18 నెలల తర్వాత, తిరిగి ఉద్యోగంలో నియమించబడ్డారు.

## సాహితీ ఉద్యమాలు:

**దిగంబర కవితోద్యమం**-1965లో, నగ్ననామ సంవత్సరంలో, మరో అయిదుగురు కవుల్తో దిగంబర కవితోద్యమం ప్రయోక్తగా ప్రారంభించారు. మూడు కవితా సంపుటాలతో, 1970 వరకు ఈ ఉద్యమం ప్రత్యక్షంగా కొనసాగింది. దుర్మార్గ వ్యవస్థలపై, రాజ్యంపై సమాజంలోని అసమానతలపై నిరసనగా ఈ ఉద్యమం ఇంకా పరోక్షంగా కొనసాగుతూనే ఉంది.

**విరసం**-1970లో ఏర్పడిన విరసం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు.

**కొయ్యగుర్రం**-తొలి ఆధునిక మహాకావ్యంగా, తొలి రాజకీయ, తాత్విక మహాకావ్యంగా, కావ్యాలకు, దీర్ఘ కవితలకు ఒరవడి పెట్టినదిగా వినుతికెక్కినది

మొదట ఆకాశవాణిలో ప్రసారం 1977 నవంబరులో.

'ప్రజాతంత్ర' వారపత్రికలో ప్రచురణ 1978 జనవరిలో.

మొదట పుస్తక రూపంలో వెలువడింది 1980లో.

రెండవ ముద్రణ 1998 నవంబరులో.

మూడవ ముద్రణ 2007 జనవరిలో.

'కొయ్యగుర్రం' కావ్యాన్ని రూపపరంగా, వస్తు విషయకంగా ఒక 'ఉద్యమం'గా భావించడం జరిగింది. నూతన సమాజ, రాజ్య, తాత్విక భావనలు ప్రవేశపెట్టడం వల్ల, మొదట పుస్తక రూపంగా వెలువడినప్పటి నుండీ చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి.

ఆధునిక కవితారంగంలో ఇంతటి చర్చ ఏ కావ్యంపై జరగలేదు.

ఇప్పటి వరకు రష్యన్, ఇంగ్లీష్, హిందీ, పంజాబీ, మరాఠీ, మైథిలి, ఒరియా, తమిళం, కన్నడం భాషల్లోకి అనువాదమైంది.

**అవలోకనం, కొయ్యగుర్రం దార్శనికత** వ్యాస సంకలనాలు, శ్రీ కల్లూరి భాస్కరం రచించిన **గ్లోబల్ సందర్భంలో నగ్నముని కొయ్యగుర్రం** - గ్రంథం వెలువడ్డాయి.

**ప్రజాస్వామ్యకవిత** -మౌలిక ప్రజాస్వామ్య వ్యవస్థాపనోద్దేశంతో, ప్రజాస్వామ్య భావనలు వెదజల్లుతూ, **'ప్రజాస్వామ్య కవిత'** ప్రారంభిస్తూ, **'జమ్మిచెట్టు'**, **'అద్వైత రాజ్యం'** మొదలైన ఎన్నో దీర్ఘకవితలు, వ్యాసాలు ప్రచురించారు.

- 1990లో 'ప్రజాస్వామ్య పరిశోధనా కేంద్ర' పేర ఒక వేదికను ఏర్పాటు చేసి వివిధ రంగాలకు చెందిన మేధావులతో ఉపన్యాలిప్పించారు. స్వయంగా ఉపన్యాసాలిచ్చారు.
- **ఆకాశదేవర** - విలోమకథ
- **దిగంబర కవితోద్యమం** (నగ్నముని రచించిన లఘు గ్రంథం-(పొ.శ్రీ. విశ్వ విద్యాలయం ప్రచురణ)

**తాత్త్విక దృష్టి** : ప్రతి జీవనాంశాన్నీ తాత్త్విక దృక్కోణం నుండి వీక్షించడం, ప్రత్నామ్నాయ, మానవ విలువల వ్యవస్థల ప్రతిపాదనలకై కృషి చెయ్యడం ఆయనకిష్టం.

●

It is a modern parable with age old ingredients and modern variants combining to produce a cocktail of deadly potential - a portent and a threat to all values of Democracy. The narrative encapsulates the lethal connection between politics, media, muscle, and money not to speak of propaganda and falsehood.

-Prof. C.Subbarao

Former Chairman, A.P. State Council of Higher Education



**AAKAASA DEVARA**

VILOMA KATHA

NAGNAMUNI

విలోమకథలు రాసినప్పుడు - "ఈ దేశంలో మనుషులు మనుషులుగా బతకడం లేదని, రాజకీయనాయక జీవిత విశ్వాసాలు విలువలు తలకిందులుగా నడుస్తున్నాయని" నగ్నముని కోపించాడు. ఈ కథ రాసేనాటికి, వ్యనస్థే తలకిందులుగా మారిపోయి, మనుషులు దాన్ని సత్యమని భ్రమించే పరిస్థితి ఏర్పడింది. అందుకే, పాఠకులకు నిగూఢవాతావరణస్పృహ కల్పించిన కథనంలో, మార్మికతను, ఉత్కంఠను నిర్మించిన భాషాశైలిలో తప్ప రచయిత ఇందులో ప్రయోగశీలత చూపించకపోయినా, కథ విలోమవాస్తవికతనే ప్రతిఫలించింది. ఆకాశదేవర చుట్టూ వున్న మార్మికత, మనం జీవిస్తున్న వ్యవస్థకు మనం అందిస్తున్న ఆమోదమే!

-కె.శ్రీనివాస్

సంపాదకులు, ఆంధ్రజ్యోతి

'నా గురించి పూర్తిగా నీకు తెలీదు. నేను కొన్ని పెద్ద కంపెనీలకు, వ్యక్తులకు సలహాదారుడినే. అంతకంటే ముఖ్యంగా నేను వ్యాపారస్తుణ్ణి కూడా. అది నీకు తెలీదు. సలహా, సలహాలతో మిళితమైన వ్యాపారం నాకు ముఖ్యమైంది. నా వ్యాపారం చాలా ఆధునికమైనది. మానవుడి మెదడును, అంటే ఆలోచనా సరళిని నేననుకున్న విధంగా మార్చుకునే వ్యాపారం.'

-మిస్టర్ కారష్

ఆకాశదేవరలో ఒక పాత్ర

For e-book:

**Kinige**

www.kinige.com